
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
కృష్ణా జిల్లా వార్తలు
గురువారం 27 మార్చి 2025



బెట్టింగ్‌ల జోలికెళ్లొద్దు

ఆర్థిక నేరాలు, ఆన్‌లైన్ మోసాలతో జాగ్రత్త

మల్లేశ్వరం పల్లెనిద్రలో ఎస్పీ గంగాధర్‌రావు



పల్లెనిద్ర కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ గంగాధర్‌రావు

బంటుమిల్లి, మార్చి 26 : యువత బెట్టింగ్‌ల జోలికిపోయి, వారి బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు సూచించారు. బంటుమిల్లి మండలం మల్లేశ్వరం ఎంపీయూపీ స్కూల్‌లో బుధవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలతో పోలీసులు మమేకమయ్యేందుకు ఈ కార్యక్రమం నిర్వహించిందని, ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరిస్తామని తెలిపారు. యువత బెట్టింగ్‌ల వలలో చిక్కుకుని భవిష్యత్తును అంధకారం చేసుకుంటున్నారని, దయచేసి వాటి జోలికిపోవద్దని హెచ్చరించారు. ఆర్థిక నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, సైబర్ క్రైం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనవసర ఫోన్‌కాల్స్, ఓటీపీ, మెసేజ్‌లు, లింక్‌ల జోలికి పోవద్దని సూచించారు. పిల్లలకు సోషల్ మీడియాలో మల్టీ అకౌంట్లు ఉంటున్నాయని, అవి నేరాలకు దారి తీస్తున్నాయన్నారు. సోషల్ మీడియాలో పిల్లల కదలికలపై తల్లిదండ్రులు నిఘా ఉంచటం మంచిదన్నారు. శాంతిభద్రతల విషయంలో ప్రజలు పోలీసులకు సమాచారమిస్తూ సహకరించాలని కోరారు. గ్రామస్తులు మాట్లాడుతూ ప్రమాదవశాత్తు మృతిచెందిన హోంగార్డు కాగిత పోతురాజు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, భార్యకు ఉద్యోగం ఇవ్వాలని కోరారు. పోలీసులు పార్టీలకతీతంగా ప్రజలకు సేవలందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రాజా, సీఐ నాగేంద్ర, ఎస్సై గణేశ్‌కుమార్, సర్పంచ్ శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు వీరబాబు, నీటిసంఘం అధ్యక్షుడు కాశీ పాల్గొన్నారు.

కొడాలి నానికి స్వల్ప అస్వస్థత

ఏఐజీలో చికిత్స.. నిలకడగా ఆరోగ్యం



హైదరాబాద్ సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ గుడివాడ మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని బుధవారం స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు ఆయన్ను ఏఐజీ ఆస్పత్రికి తరలించారు. హృదయ సంబంధిత సమస్యతో ఆసుపత్రిలో చేరిన ఆయనకు ఏఐజీ వైద్యులు పలు పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా కొడాలి నాని ఆరోగ్యంపై ఆయన అనుచరులు ఎక్స్‌లో స్పందిస్తూ... 'గ్యాస్ట్రిక్ సమస్యతో ఏఐజీ ఆస్పత్రికి వెళ్లారు. ఆయన క్షేమంగానే ఉన్నారు. మీడియాలో వస్తున్న వదంతులు నమ్మవద్దు' అని పేర్కొన్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 06-24 (గురువారం సాయంత్రం)
సహర్ : 04-46 (శుక్రవారం ఉదయం)

ప్రగతి.. పురోగతి

క్యాపిటల్ ఇన్‌కమ్ ప్రధాన మార్గంగా జిల్లా పాలన

ప్రస్తుతం క్యాపిటల్ ఇన్‌కమ్ రూ. 4,88,310 కోట్లు



సీఎంతో కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ బాలాజీ

జిల్లా మూలధన ఆదాయం రూ.4,88,310 కోట్లు ఉండగా, ఈ ఏడాది 16.54 శాతం మేర వృద్ధిని సాధించాలని లక్ష్యంగా పనిచేస్తున్నామని కలెక్టర్ బాలాజీ వివరించారు. వెలగపూడిలోని సచివాలయంలో బుధవారం జరిగిన మూడో విడత కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో జిల్లా అభివృద్ధి, వివిధ రంగాల్లో సాధించిన ప్రగతి, ఇంకా సాధించాల్సిన లక్ష్యాలపై కలెక్టర్ సోదాహరణంగా వివరించారు. జిల్లా మూలధన ఆదాయం, వివిధ రంగాల అభివృద్ధికి ప్రభుత్వ నుంచి రావాల్సిన సహకారం గురించి ఆయన తెలిపారు. - ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం

- వృద్ధిరేటును 16.54 శాతం మేర పెంచేలా సమగ్ర ప్రణాళిక
- వ్యవసాయ, అనుబంధ రంగాలకు చేయూతనిచ్చేలా ప్లాన్
- పెడనలో కలంకారీ క్లస్టర్ ఏర్పాటుకు సన్నాహాలు
- జిల్లాలో అందుబాటులో 13 లక్షల టన్నుల ఇసుక
- పంటలు భద్రపరచుకునేందుకు 18 గోడౌన్ల నిర్మాణం
- జిల్లా సమగ్ర నివేదికను సీఎం చంద్రబాబుకు వివరించిన కలెక్టర్ బాలాజీ

■ వ్యవసాయంలో ఎరువుల వినియోగం తగ్గించే విషయంలో రైతులకు అవగాహన కల్పించేందుకు 22 వేల భూసార పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించినట్లు కలెక్టర్ బాలాజీ సీఎం చంద్రబాబుకు తెలిపారు. ఈ ఏడాది మే 31 నాటికి ఈ పనిని పూర్తి చేస్తామని చెప్పారు. 2025-26 సంవత్సరంలో ఎలాంటి అదనపు ఖర్చు లేకుండా సేంద్రీయ పద్ధతిలో వ్యవసాయం చేసేందుకు 141 పంచాయతీల్లోని 59,206 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేసేందుకు ప్రణాళికను రూపొందించామన్నారు. 890 హెక్టార్లలో ఉద్యాన పంటల సాగును విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇందులో 100 హెక్టార్లలో 140 మంది రైతులతో పండ్లజాతి మొక్కల పెంపకం, 50 హెక్టార్లలో 80 మంది రైతుల ద్వారా కూరగాయలు, పూలసాగు, 690 హెక్టార్లలో 700 మంది రైతులతో వివిధ రకాల తోటలు, 60 మంది రైతులతో 50 హెక్టార్లలో సుగంధద్రవ్య మొక్కల సాగు చేపట్టాలని ప్రణాళికను రూపొందించామన్నారు. జూన్ నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. 2026, మార్చి నాటికి మైక్రో ఇరిగేషన్ పద్ధతిని 1,200 హెక్టార్లలో ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.

■ పీఎంఈజీపీ పథకం ద్వారా జిల్లాలో 100 యూనిట్ల చిన్నతరహా పరిశ్రమలు, ఎంఎస్‌ఎంఈ ద్వారా 100 యూనిట్లు, నాలుగు పెద్ద పరిశ్రమలను 2026 చివరి నాటికి ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని కలెక్టర్ చెప్పారు. పెడనలో కలంకారీ క్లస్టర్‌ను 2026 చివరి నాటికి ప్రారంభించడానికి అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ ఏడాది జిల్లాలోని ఇసుక రేవుల ద్వారా 13 లక్షల టన్నుల ఇసుకను ప్రజలకు అందుబాటులో ఉంచామని చెప్పారు. ఉపాధి హామీ పథకం కింద రూ.100 కోట్లతో వివిధ రకాల నిర్మాణాలు చేపట్టనున్నామన్నారు. జిల్లాలో 387 కిలోమీటర్ల మేర రహదారులకు మరమ్మతులు ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేసేందుకు ప్రణాళికను రూపొందించామన్నారు.

■ గ్రామీణ ప్రాంతాల్లో లోవోల్టేజీ సమస్యను తీర్చేందుకు పది 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లను ఈ ఏడాదిలో నిర్మించనున్నామని కలెక్టర్ చెప్పారు. తాగునీటి అవసరాలు తీర్చేందుకు ఓఎన్‌జీసీ సహకారంతో బంటుమిల్లి మండలంలో తొమ్మిది తాగునీటి బావులను తవ్వించనున్నట్లు చెప్పారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర లభించే వరకు నిల్వ చేసుకునేందుకు జిల్లాలో మిగతా 6లో..

■ వ్యవసాయంలో జీడీవీఏ రూ.4,212 కోట్ల మేర ఉండగా 13.12 శాతంగా నమోదైందని, ఉద్యాన పంటల సాగులో రూ.2,793 కోట్లు ఉండగా, 9.47 శాతం వృద్ధిని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. జూన్ 10న వరి సాగునీటిని విడుదల చేస్తే అక్టోబరులోనే వరికోతలు పూర్తి చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. జూలై, ఆగస్టు నెలల్లో కాల్వలకు సాగునీటిని విడుదల చేయడంతో పంటల సాగు ఆలస్యమై నవంబరులో కురిసే భారీ వర్షాలకు పంటలు దెబ్బతింటున్నాయని తెలిపారు. ఈ ఏడాది 31,784 హెక్టార్లలో పచ్చిరొట్ట ఎరువులను సాగుచేసి భూసారాన్ని పెంచే ఆలోచన చేస్తున్నామన్నారు. మత్స్యసంపద ఉత్పత్తి ద్వారా వచ్చే ఆదాయం రూ.321.30 కోట్లు ఉండగా, 15.21 శాతం వృద్ధిరేటు సాధించాలని, 32,804 ఎకరాలను ఆక్వాజోన్ పరిధిలోకి తేవాలని నిర్ణయించినట్లు తెలిపారు. సోలార్ పవర్‌ను ఆక్వా చెరువుల్లో వినియోగంలోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు.

చినగొల్లపాలేన్ని ఆదుకోండి

సముద్రపు అలల తాకిడి నుంచి కాపాడండి

నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌కు ఎంపీ బాలశౌరి వినతి



చినగొల్లపాలెం వద్ద కోతకు గురవుతున్న కట్ట



నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సభ్యుడికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ వల్లభనేని బాలశౌరి

మచిలీపట్నం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : కృత్తివెన్ను మండలం చినగొల్లపాలెం గ్రామం సముద్రపు అలల తాకిడికి కొట్టుకుపోకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి కోరారు. ఢిల్లీలో నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సభ్యుడు రాజేంద్రసింగ్‌ను బుధవారం కలిసిన ఆయన ఈ అంశంపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మిగతా 6లో..

చెమిర్చిన కళ్లు

కోల్డ్ స్టోరేజీ అగ్ని ప్రమాదంతో రైతుల గుండెల్లో ఆరని మంటలు

సరుకు నిల్వ ఉన్నా ఇన్సూరెన్స్ పునరుద్ధరించని యాజమాన్యం

ఇప్పటికే రూ.6.63 కోట్ల అప్పు.. మరో రూ.10 కోట్ల రుణానికి దరఖాస్తు



కోల్డ్ స్టోరేజీ భవనం నుంచి వస్తున్న పొగ



కుప్పకూలిన భవనంలోని ఓ భాగం

- రైతుల బాండ్లను తాకట్టు పెట్టి భారీ రుణాలు
- అదే డబ్బు అధిక వడ్డీకి తిరిగి రైతులకు..
- పరిమితికి మించి స్టోరేజీలో సరుకు నిల్వ
- స్టాక్, మూవ్‌మెంట్ రిజిస్టర్లు మాయం
- ప్రభుత్వం న్యాయం చేయాలని రైతుల వేడుకోలు

తప్పుల మీద తప్పులు.. అప్పుల మీద అప్పులు.. జగ్గయ్యపేటలోని తిరుమలగిరి కోల్డ్ స్టోరేజీ యాజమాన్యం చేసిన నిర్వాకాల కారణంగా రైతుల గుండెల్లో ఆరని మంటలు రేగుతున్నాయి. రైతుల పేరిట బ్యాంకుల్లో రూ.కోట్ల రుణాలు తీసుకోవడం, తిరిగి వారికే వాటిని అధిక వడ్డీకి అప్పుగా ఇవ్వడం, దొరికిన ప్రతిచోటా రుణాలు తీసుకోవడం, కనీసం ఇన్సూరెన్స్‌ను కూడా పునరుద్ధరించకపోవడం, పరిమితికి మించి సరుకును నిల్వ చేయడం వంటి యాజమాన్య నిర్లక్ష్య వైఖరుల కారణంగా ఇప్పుడు అమాయక అన్నదాతలు రోడ్డున పడే పరిస్థితి దాపురించింది.

(ఆంధ్రజ్యోతి, జగ్గయ్యపేట) : తిరుమలగిరి అగ్రి కోల్డ్ స్టోరేజీ యాజమాన్య నిర్వాకం కారణంగా మిర్చి రైతులు సర్వం కోల్పోయారు. నష్టాన్ని పూడ్చే అన్ని దారులూ వారికి మూసుకుపోయాయి. ఇన్సూరెన్స్‌కు కూడా దరఖాస్తు చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. అగ్ని ప్రమాదం సంభవించక ముందే ఇన్సూరెన్స్ గడువు పూర్తై పోయింది. యాజమాన్యం ఇన్సూరెన్స్‌ను పునరుద్ధరించకపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దీంతో పాటు నిర్వాహకులు ఇబ్బడిముబ్బడిగా చేసిన అప్పులు, పంటపై రుణం కోసం దరఖాస్తు చేసుకోవడం వంటివి రైతులను తీవ్రంగా నష్టపరిచేలా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రంగంలోకి దిగి కోల్డ్ స్టోరేజీ ప్లాంట్ నిర్వాహకుల నుంచి డబ్బు కట్టిస్తేనే రైతులకు న్యాయం జరుగుతుంది. మార్కెటింగ్ శాఖ గణాంకాల ప్రకారం.. తిరుమలగిరి అగ్రి కోల్డ్ స్టోరేజీలో 385 మంది రైతులు తమ మిర్చి పంటను ఉంచారని తెలుస్తోంది. వత్సవాయి మండలంలోని భీమవరం, మక్కపేట, మంగొల్లు, శింగవరం తదితర గ్రామాలతో పాటు తెలంగాణాలోని దొండపాడు గ్రామం మిగతా 6లో..

రిజిస్టర్లు మాయం

కోల్డ్ స్టోరేజీలో అనధికారికంగా కూడా సరుకును నిల్వ చేసినట్టుగా తెలుస్తోంది. స్టోరేజీ రిజిస్టర్లతో పాటు మూవ్‌మెంట్ రిజిస్టర్లను కూడా యాజమాన్యం మాయం చేసింది. దీంతో అనేక అనుమానాలు కలుగుతున్నాయి. యాజమాన్యం అనధికారికంగా పరిమితికి మించి నిల్వలు ఉంచినట్టుగా అనుమానాలు నెలకొంటున్నాయి. కోల్డ్ స్టోరేజీ సామర్థ్యం కేవలం 80 వేల టిక్కీలకే సరిపోతుంది. మొత్తం ఎకరం భూమిలో 40 సెంట్ల విస్తీర్ణంలో కోల్డ్ స్టోరేజీని నిర్మించారు. పరిమితికి మించి మిర్చిని నిల్వ ఉంచిన విషయం వెలుగులోకి రాకుండా ఉండేందుకు యాజమాన్యం రిజిస్టర్లను మాయం చేసిందని తెలుస్తోంది.

అందిన ప్రతిచోటా అప్పు

కోల్డ్ స్టోరేజీ ప్లాంట్ యాజమాన్యం అందిన ప్రతిచోటా అప్పులు చేసిందని తెలుస్తోంది. ఒక జాతీయ బ్యాంక్ నుంచి రూ.6.63 కోట్ల అప్పును తీసుకున్నట్టు సమాచారం. ఈ అప్పుతో పాటు మరో రూ.10 కోట్ల రుణాన్ని తీసుకోవటానికి దరఖాస్తు చేసుకున్నట్టు తెలుస్తోంది. రైతులు కోల్డ్ స్టోరేజీ ప్లాంట్‌లో సరుకును ఉంచినపుడు వారికి నిర్వాహకులు బాండ్లు ఇస్తారు. ఈ బాండ్లపై రైతులు బ్యాంకుల నుంచి రుణాలను తీసుకునే అవకాశం ఉంటుంది. తిరుమలగిరి కోల్డ్ స్టోరేజీ నిర్వాహకులు మాత్రం మిర్చి రైతులకు ఇవ్వాల్సిన బాండ్లను తమ దగ్గరే ఉంచుకున్నట్టు తెలుస్తోంది. స్వల్ప సంఖ్యలోనే రైతులకు బాండ్లను ఇచ్చినట్టు సమాచారం. తమ దగ్గర ఉన్న బాండ్లను బ్యాంకులో పెట్టి రూ.10 కోట్ల రుణాన్ని తీసుకోవటానికి దరఖాస్తు చేసినట్టుగా సమాచారం. రుణం కూడా మంజూరైనట్టు తెలుస్తోంది.

కుప్పకూలిన కోల్డ్ స్టోరేజీ

- అదుపులోకి వచ్చిన మంటలు
- రెండోరోజు ఫైరింజన్లు, యంత్రాలతో ఆపరేషన్

6లో

యజమానిపై కేసు నమోదు

- జగ్గయ్యపేట తహసీల్దార్ ఫిర్యాదు మేరకు రాపూరి శ్రీనివాసరావుపై కేసు
- దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు

ఇసుకలో మిర్చి మాయ

ఆ కోల్డ్ స్టోరేజీని నడిపేది ఇసుక సిండికేట్లే..!

» యాజమాన్యం ఎవరైనా నడిపిస్తున్నది మాత్రం వారే

(ఆంధ్రజ్యోతి, జగ్గయ్యపేట రూరల్) : మిర్చి రైతులను నట్టేటముంచిన తిరుమలగిరి కోల్డ్ స్టోరేజీ నిర్వాహకులు మైనింగ్ మాఫియా సిండికేట్ చేతుల్లో ఉన్నారని తెలుస్తోంది. జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఇసుక, మట్టి, గ్రావెల్ దందాల్లో ఆరితేరిన వారంతా ఒక మిగతా 6లో..

అప్పుల పేరిట తప్పులు

రైతుల బాండ్లను బ్యాంకులో పెట్టి రుణాలు

అదే డబ్బు తిరిగి అధిక వడ్డీకి రైతులకు..

(ఆంధ్రజ్యోతి, జగ్గయ్యపేట రూరల్) : ఇసుక సిండికేట్ మాఫియా మరో దారుణానికి తెగబడింది. కోల్డ్ స్టోరేజీ నిర్వాహకుడి ద్వారా రైతుల మిర్చికి ఇచ్చిన బాండ్లను బ్యాంకులో కుదవపెట్టి భారీ ఎత్తున రుణం తీసుకుంది. ఆ రుణాన్నే తిరిగి రైతులకు అప్పుగా మిగతా 6లో..

నాకు దిక్కెవరు..?



300 టిక్కీల మిర్చిని రెండు రోజుల క్రితం ఈ కోల్డ్ స్టోరేజీలో పెట్టాం. వాటి డబ్బులు ఇస్తామంటే వచ్చా. కూలీలకు డబ్బులివ్వాలి. ఇప్పుడు ఏం చేయాలో దిక్కు తోచటం లేదు. కాగితాలు కూడా తీసుకోలేదు. నాకు దిక్కెవరు? ప్రభుత్వం ఆదుకోవాలి. - రొయ్యల సైదులు, వత్సవాయి

ఆశలు బుగ్గి!

గోదాములో కోట్ల విలువైన మిర్చి నిల్వలు భస్మీపటలం

- మంచి ధర వస్తుందని శీతల గిడ్డంగిలో నిల్వ
- లక్షల పెట్టుబడి మంటల్లో దగ్ధం
- పీకల్లోతు నష్టాల్లో కూరుకుపోయిన మిర్చి రైతు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

అగ్ని ప్రమాదంలో భస్మీపటలమైన జగ్గయ్యపేట ప్రాంతంలోని శీతల గిడ్డంగిలో మిర్చి పంటను నిల్వ చేసిన రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. సాగు ప్రారంభం నుంచి అష్టకష్టాలు పడుతున్న రైతులకు ఊరట లభించకపోగా, ఇప్పట్లో కోలుకోలేనంతగా ఊబిలో కూరుకుపోయారు. ఒకవైపు దిగుబడి రాక, మరోవైపు ధర లేక పీకల్లోతు నష్టాల్లో కూరుకుపోయిన మిర్చి రైతులు ముమ్ముందు ధర పెరుగుతుందన్న ఆశతో మిర్చిని నిల్వ చేయగా, శీతల గిడ్డంగి నిలువునా కాల్చేసి, బూడిద మిగిల్చింది.


కుప్పకూలిన కోల్డ్ స్టోరేజీ మిర్చి నిల్వ ఉంచిన భాగం

(జగ్గయ్యపేట - ఆంధ్రజ్యోతి)
జిల్లాలో ముఖ్యంగా పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాలు మిర్చి సాగుకు ఎంతో ప్రసిద్ధి. ఈ ఏడాది జిల్లాలో 30వేల ఎకరాల్లో పంటను సాగు చేశారు. ఎకరం కౌలు రూ. 30 వేలనుంచి రూ. 40 వేలు. ఒక్కొక్క మొక్క రూ. 1.50ల వంతున కొని, ఎకరానికి 15 వేల మొక్కలు నాటారు. ఎకరానికి పెట్టుబడి రెండు లక్షలైంది. ఆగస్టు చివర్లో, సెప్టెంబరు మొదట్లో కురిసిన భారీ వర్షాలు, వరదలకు వాగుల వెంబడి, లోతట్టు ప్రాంతాల్లోని తోటలు దెబ్బతిన్నాయి. ఖర్చుకు వెనుకాడకుండా రైతులు మరల తోటలు సాగు చేశారు. డిసెంబరు మొదట్లో ఎర్రనల్లి, నల్లనల్లి ఉధృతంగా దాడిచేశాయి. మందులు పిచికారి చేసినప్పటికీ నల్లి అదుపులోకి రాలేదు. రోజుల వ్యవధిలోనే తోటలు కకావికలమయ్యాయి. పూత రాలిపోగా, ఆకులు, పిందెలు నల్లగా మాడిపోయాయి. వేరుకుళ్లు సోకినట్టుగా తోటలు ఎర్రబడి నిలువునా ఎండిపోయాయి. ముదురు తోటల్లో అయితే ఎకరానికి 10 నుంచి 15 క్వింటాళ్ల లోపు, లేత తోటల్లో ఐదు నుంచి పది క్వింటాళ్ల లోపు దిగుబడి మాత్రమే వచ్చింది.

రైతును ముంచేసిన మార్కెట్!

మార్కెట్ సైతం రైతులను నిలువునా ముంచేసింది. కోతల సమయంలో తేజ రకానికి క్వింటా రూ.8 వేలనుంచి రూ. 12 వేలలోపు, లావు రకాలకు రూ. 8 వేల నుంచి రూ.10 వేలలోపు ధర పలికింది. ప్రస్తుతం తేజ రకానికి మార్కెట్ పూర్తిగా పడిపోయింది. రూ.9వేలు కూడా లభించటం గగనమవుతోంది. ఒక విధంగా చెప్పా లంటే గత ఏడాది తాలు (తెల్ల) కాయలకు వచ్చిన ధర కూడా ఇప్పుడు ఎర్ర కాయలకు రావటం లేదు.

ధర పెరుగుతుందన్న ఆశతో గిడ్డంగుల్లో నిల్వ

ఈ నేపధ్యంలో ఎక్కువమంది రైతులు ముమ్ముందు ధర పెరుగుతుందన్న ఆశతో శీతల గిడ్డంగుల్లో మిర్చిని నిల్వ చేస్తున్నారు. భీమవరం, మక్కపేట, వత్సవాయి, మంగొల్లు, ఇందుగపల్లి, తెలంగాణా రాష్ట్రం దొండపాడు తదితర గ్రామాలకు చెందిన వందలాది మంది రైతులు జగ్గయ్యపేట సమీపంలోని శీతల గిడ్డంగిలో మిర్చిని నిల్వ చేశారు. శీతల గిడ్డంగి యాజమాన్యం, మార్కెటింగ్ శాఖాధికారులకు ఇచ్చిన నివేదిక ప్రకారం ఫిబ్రవరి నెలాఖరుకు గిడ్డంగిలో 385 మంది రైతులు 13,960 మిర్చి టిక్కీలను నిల్వచేశారు. అయితే మార్చి నెలలో మార్కెట్ ఇంకా కుప్పకూలటంతో ఎక్కువ మంది రైతులు 25 వేలకు పైగా టిక్కీలను గిడ్డంగికి తరలించారు. యాజమాన్యం చెపుతున్న లెక్కల ప్రకారం దాదాపుగా ఆరు వందల మంది రైతులు 40 వేల టిక్కీలను గిడ్డంగిలో భద్రపరిచారు.

తల్లడిల్లుతోన్న మిర్చి రైతులు..

ఆరుగాలం కష్టపడి పండించిన పంటంతా గంటల వ్యవధిలోనే బూడిదగా మారటంతో రైతులు తల్లడిల్లిపోతున్నారు. రెండురోజులుగా తిండీ తిప్పలు మానేసి భోరున విలపిస్తున్నారు. శీతల గిడ్డంగి దెబ్బకు కొన్ని కుటుంబాలు ఆర్థికంగా తలకిందులయ్యే పరిస్థితి దాపురించింది. రక్తాన్ని స్వేదంగా మార్చి ఆరుగాలం శ్రమించి పండించిన పంట అగ్గికి ఆహుతి అవడంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. తమకు దిక్కెవరంటు వాపోతున్నారు. ఖమ్మం, గుంటూరులలో నిల్వచేసే రైతులు యాజమాన్యాన్ని నమ్మి ఇక్కడ నిల్వ చేస్తే ఈ దుస్థితి కల్పించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దాచుకున్న పంట హామీ తీసుకుని రుణం అడిగితే అధిక వడ్డీ అడగటంతో అనేకమంది తీసుకోలేదు. కొంతమంది రైతులే కూలీలకు, కౌలుకు ఇవ్వాలని యాజమాన్యం వద్ద రుణం తీసుకున్నారు. ప్రమాదానికి రెండు, మూడు రోజుల ముందు నిల్వచేసుకున్న రైతులు అక్నాలెడ్జ్‌మెంట్ రశీదులు కూడా తీసుకోలేదు. యాజమాన్యం కనీసం కోల్డ్‌స్టోరేజీకి, పంటకు బీమా చేయించకపోవటం, వారి నిర్ల క్ష్యానికి తాము బలి కావాల్సి వస్తున్నదని తల్లడిల్లిపోతున్నారు.


జగ్గయ్యపేట సీఐ వెంకటేశ్వర్లుకు తమ గోడు వినిపిస్తున్న రైతులు

పరిస్థితి అగమ్యగోచరం

\- బాలిరెడ్డి, దొండపాడు



100 క్వింటాళ్ల మిర్చి నిల్వచేశాం. మా ఊరి వాళ్లు 20 మంది రైతులు పదేళ్లుగా ఇక్కడ స్టోరేజీలో ఉంచుతున్నాం. ధర లేదని ఇక్కడ పెడితే ఇప్పుడు ప్రమాదం జరిగింది. పరిస్థితి ఏమిటో గందరగోళంగా ఉంది. మాకు సమాధానం చెప్పేవాళ్లు లేరు.

ధర లేదని కోల్డ్ స్టోరేజిలో ఉంచాం

\- శ్రీనివాసరావు, సింగవరం



ధర లేదని 40 క్వింటాళ్ల మిర్చిని సంవత్సరం క్రితం ఇక్కడ ఉంచాం. డబ్బులు తీసుకోలేదు. రుణం కావాలని అడిగితే చూద్దామని వాయిదా వేశారు. ఇప్పుడు చూస్తే అసలు పంటే లేకుండా పోయింది. మాకు జరిగిన నష్టాన్ని ఎవరు భర్తీ చేస్తారు.

యాజమాన్యం నుంచి డబ్బులు ఇప్పించండి సారూ..

\- చిట్టా వెంకటరెడ్డి, భీమవరం



యాజమాన్యం నుంచి పోలీసులు, ప్రజాప్రతినిధులు డబ్బులు ఇప్పించాలి. 750 టిక్కీలు మిర్చిని నిల్వ ఉంచాం. ఏ విధమైన భద్రతా చర్యలు తీసుకోకుండా నిండా ముంచేశారు. మాకు న్యాయబద్ధంగా నిల్వ ఉంచిన మిర్చికి డబ్బులు ఇప్పించాలి. మేము నిల్వ ఉంచిన మిర్చికి పూర్తి బాధ్యత యాజమాన్యానిదే. రైతుల తరఫున ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు నిలవాలి.


ఢిల్లీలో కేంద్రమంత్రులు హర్దీప్ సింగ్ పూరి, రాజ్‌నాథ్ సింగ్, ఎన్డీయే ఎంపీలతో కేశినేని శివనాథ్

ఏపీకి ఏరో స్పేస్, డిఫెన్స్ పారిశ్రామిక రంగాలు..

- కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సానుకూలత

వన్‌టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఏపీకి ఏరో స్పేస్, డిఫెన్స్ పారిశ్రామిక రంగాలు వచ్చేందుకు కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సానుకూలత ప్రకటించారని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరి అధ్యక్షతన మంగళవారం న్యూఢిల్లీలో నిర్వహించిన ఎన్డీయే ఎంపీల సమావేశంలో శివనాథ్ పాల్గొన్నారు. ఎన్డీయే కూటమి ఎంపీలందరూ తమ నియోజకవర్గ పరిధిలోని సమస్యలు, కేంద్ర పథకాల అమలు, నిధుల అవసరాలు తదితరాలను తెలుసుకునే క్రమంలో శివనాథ్‌తో పాటు బస్తిపాటి నాగరాజు పంచలింగాల పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమావేశానికి ముఖ్య అతిథిగా వచ్చిన కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో ఎంపీ మాట్లాడుతూ, ఏపీలో ఏరో స్పేస్, డిఫెన్స్ పరికరాల తయారీ పరిశ్రమలను నెలకొల్పేందుకు సహకరించాలని కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. నియోజకవర్గ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరితో ఎంపీ చర్చించారు.

ఏపీలో భూగర్భ ఉష్ణశక్తి ఉత్పత్తి ప్లాంట్ ప్రతిపాదనలు లేవు

- కేంద్ర మంత్రి శ్రీపాద యశో నాయక్ వెల్లడి

ఆంధ్రప్రదేశ్‌లో భూగర్భ ఉష్ణశక్తి (జియోథర్మల్ ఎనర్జీ) ఉత్పత్తి ప్లాంట్ ఏర్పాటుకు ఎలాంటి ప్రతిపాదనలు లేవని కేంద్ర విద్యుత్, నూతన పునరుత్పాదక ఇంధన శాఖ సహాయ మంత్రి శ్రీపాద యశో నాయక్ వెల్లడించారు. ఎంపీ కేశినేని శివనాథ్ పార్లమెంటులో అడిగిన ప్రశ్నకు బుధవారం ఆయన లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. భారత ప్రభుత్వం "పునరుత్పాదక శక్తి పరిశోధన, సాంకేతిక అభివృద్ధి కార్యక్రమం" ద్వారా భూ ఉష్ణశక్తి అభివృద్ధిని ప్రోత్సహిస్తోంది. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) 381 భూ ఉష్ణశక్తి ప్రాంతాలపై అధ్యయనం చేసి జియోథర్మల్ అట్లాస్ ఆఫ్ ఇండియా-2022 నివేదికను విడుదల చేసింది. దీని ప్రకారం దేశవ్యాప్తంగా 10,600 మెగావాట్ల భూగర్భ ఉష్ణశక్తి ఉత్పత్తి సామర్థ్యం ఉందని అంచనా వేయబడిందని.. అయితే ఈ నివేదికలో ఆంధ్రప్రదేశ్‌లోని ప్రత్యేక ప్రాంతాల వివరాలు లేవన్నారు. తెలంగాణలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు వద్ద సింగరేణి కొల్లియరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) కిలోవాట్ల భూగర్భ ఉష్ణశక్తి ప్లాంట్‌ను పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్‌లో భూగర్భ ఉష్ణశక్తి ప్లాంట్‌కు ఎటువంటి ప్రతిపాదనలు లేవని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. దీంతో పాటు ఏపీలో భూగర్భ ఉష్ణశక్తి ప్రాజెక్టుల కోసం ఎటువంటి నిధులు కేటాయించలేదని కేంద్ర మంత్రి తెలిపారు.

డీఆర్డీవో చైర్మన్‌తో ఎంపీ భేటీ

ఎంపీ కేశినేని శివనాథ్ బుధవారం ఢిల్లీలో భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) చైర్మన్ డాక్టర్ సమీర్ విక్రాంత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు తిరుపతి ప్రసాదం అందజేశారు. నూతన రాజధాని అమరావతిలో భాగమైన విజయవాడ పరిసరప్రాంతాలు పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి రక్షణ ఉత్పత్తి పరిశ్రమలను ఏర్పాటు చేయాలని ఎంపీ కోరగా సమీర్ విక్రాంత్ సానుకూలంగా పరిశీలిస్తామని తెలిపారు.

సుబ్బారాయుడి హుండీల ఆదాయం రూ.1.02 కోట్లు

మోపిదేవి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి భక్తులు సమర్పించిన కానుకలు హుండీల ద్వారా రూ.1,02,44,254లు వచ్చినట్టు ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. బుధవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో దేవదాయ అధికారుల పర్యవేక్షణలో భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపు నిర్వహించారు. 104 రోజులకుగాను ఆలయంలో హుండీల ద్వారా రూ.98,48,539లు, అన్నదానసత్రంలో హుండీ ద్వారా రూ.3,95,715లు, వెండి 2కేజీల 188 గ్రాములు, బంగారం 48 గ్రాములు వచ్చినట్టు తెలిపారు. హుండీల లెక్కింపులో ఆలయ ఉద్యోగులు, సేవా సమితి సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందుకు హాజరైన జగన్

విజయవాడ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): విజయవాడ గురునానక్ కాలనీలోని ప్రైవేటు కల్యాణ మండపంలో బుధవారం సాయంత్రం ముస్లిం నిర్వహించిన ఇఫ్తార్ విందుకు మాజీ సీఎం జగన్ హాజరయ్యారు. ముందుగా ముస్లిం మతపెద్దలు ప్రార్థనలు చేశారు. అనంతరం వారికి జగన్ ఉర్దూలో రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు దేవినేని అవినాష్, మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ తలశిల రఘురాం తదితరులు పాల్గొన్నారు.

చె'మిర్చి'న కళ్లు

(5వ పేజీ తరువాయి)

నుంచి కూడా రైతులు ఇక్కడ పెద్ద సంఖ్యలో మిర్చిని నిల్వ ఉంచినట్టుగా తెలుస్తోంది. ఎక్కువ రేటు వస్తుందన్న ఉద్దేశంతో రైతులు ఈ కోల్డ్ స్టోరేజీని ఎంచుకున్నారు. రైతులు చెబుతున్న దాని ప్రకారం.. 40 వేల టిక్కీలు ఇక్కడ నిల్వ ఉంచినట్టుగా తెలుస్తోంది. కోల్డ్ స్టోరేజీ యాజమాన్యం పరారయ్యే ముందు స్టాక్ రిజిస్టర్‌తో పాటు మూవ్‌మెంట్ రిజిస్టర్లను కూడా తరలించేసింది. దీంతో వాస్తవంగా ఎన్ని టిక్కీల మిర్చి ఉంటుందన్నది తేలట్లేదు. మార్కెటింగ్ శాఖ అధికారులు రైతుల నుంచి సేకరిస్తున్న వివరాల ప్రకారం.. బుధవారం మధ్యాహ్నం వరకు 14 వేల టిక్కీలకు సంబంధించి లెక్క తేలినట్టుగా తెలుస్తోంది. సర్వే పూర్తయితే కానీ పూర్తి వివరాలు వెల్లడికావు. ఈ నేపథ్యంలో వత్సవాయి మండలంలోని గ్రామాల్లోని రైతుల ఇళ్లకు నేరుగా వెళ్లి వివరాలు నమోదు చేయాలని వీఆర్వోలకు ఆదేశాలు అందాయి.

ఇన్సూరెన్స్ లేక ఇక్కట్లు

కోల్డ్ స్టోరేజీ ఇన్సూరెన్స్ ముగియడంతో రైతులకు నయాపైసా కూడా వచ్చే పరిస్థితి లేదు. ఇది కోల్డ్ స్టోరేజీ నిర్వాహకుల తప్పిదమే. ఇన్సూరెన్స్ ముగిసిన విషయం తెలిసి కూడా దానిని పునరుద్ధరించటానికి యాజమాన్యం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పునరుద్ధరణకు లక్షల రూపాయలు చెల్లించాల్సి ఉండటంతో ఆ పని చేయలేదని తెలుస్తోంది. కనీసం రైతుల నుంచి 80 వేల టిక్కీల మిర్చిని తీసుకున్నప్పుడైనా నిర్వాహకులు ఇన్సూరెన్స్‌ను పునరుద్ధరించాల్సి ఉన్నా ఆ పని కూడా చేయలేదు. దీంతో ఇన్సూరెన్స్ ప్రయోజనాలేమీ కనిపించట్లేదు. యాజమాన్యానికి ఇన్సూరెన్స్ వచ్చినా.. అందులో కొంతమేర అయినా రైతులకు ప్రయోజనం అందే అవకాశం ఉండేది.

మార్కెటింగ్ విజిలెన్స్ డీడీ లావణ్య తనిఖీలు

జగ్గయ్యపేట : సాయి తిరుమలగిరి కోల్డ్ స్టోరేజ్‌ను మార్కెటింగ్ శాఖ విజిలెన్స్ డీడీ లావణ్య బుధవారం తనిఖీ చేశారు. మంగళవారం కోల్డ్‌స్టోరేజీలో విజయవాడ మార్కెటింగ్‌శాఖ ఏడీ మంగమ్మ స్వాధీనం చేసుకున్న రికార్డులను ఆమె పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్, మూవ్‌మెంట్ రిజిస్టర్లు అందుబాటులో లేవని తెలిపారు. ఏసీకే ఓచర్ల ఆధారంగా నిల్వ ఉన్న స్టాకును లెక్కించాలని ఆమె అధికారులను ఆదేశించారు. గత ఫిబ్రవరి తర్వాత కొత్తగా స్టోరేజీలో ఉంచిన పంట వివరాలపై విచారణచేశారు. ఆమె వెంట ఏడీ మంగమ్మ, ఏఎంసీ సెక్రటరి ఎన్వీ నరసింహారావు, సూపర్‌వైజర్లు ఉన్నారు.

చినగొల్లపాలేన్ని ఆదుకోండి

(5వ పేజీ తరువాయి)

ఎంపీ మాట్లాడుతూ సముద్రతీరం పక్కనే ఉన్న చినగొల్లపాలెం గ్రామం తరచూ సముద్రపు అలల తాకిడికి గురై భూభాగం సముద్రంలో కలిసిపోతోందన్నారు. ఈ ప్రాంతంలోకి సముద్రపు నీరు చొచ్చుకురావడంతో పంటలు పండట్లేదన్నారు. దీంతో స్థానికుల జీవనం దెబ్బతింటోందని పేర్కొన్నారు. ఈ గ్రామంలోని భూభాగం కొట్టుకుపోకుండా, సముద్రపు అలలు ఉప్పెత్తున రాకుండా రక్షణ గోడ నిర్మించాలని ఎంపీ కోరారు. మడ అడవులను ఇక్కడ మరింతగా పెంచాలన్నారు. ఇసుక తవ్వకాలను పూర్తిస్థాయిలో నిలిపివేయాలని కోరారు. తీరప్రాంతంలోని ఈ గ్రామ పరిరక్షణకు కోస్టల్ మేనేజ్‌మెంట్ ద్వారా.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన సాయంతో సముద్రపు అలల ఉధృతిని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అలల ఉధృతి కారణంగా భూమి కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందించడంతో పాటు పునరావాస కార్యక్రమాలను అమలు చేయాలని కోరారు. కాగా, చినగొల్లపాలెం గ్రామ పరిరక్షణ కోసం సాధ్యమైనంత త్వరగా చర్యలు తీసుకుంటామని రాజేంద్రసింగ్ హామీ ఇచ్చినట్లు ఎంపీ తెలిపారు.

అప్పుల పేరిట తప్పులు

(5వ పేజీ తరువాయి)

ఇచ్చింది. రైతులకు ఇవ్వాల్సిన బాండ్లను తమ వద్దే ఉంచుకోవటం ఓ తప్పయితే, ఆ బాండ్లను బ్యాంకులో తనఖా పెట్టి అప్పు తెచ్చి, ఆ డబ్బే తిరిగి రైతులకు రూపాయిన్నర వడ్డీకి ఇవ్వటం మరో తప్పు. రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని చాలామందికి రూ.1.50కు వడ్డీకి ఇవ్వడం ఇంకో తప్పు. రైతులకు ఇవ్వాల్సిన బాండ్లను తమ వద్దే ఉంచుకుని వారి పేర్లతో రుణాలు తీసుకోవడం వల్ల ఇప్పుడు రైతులు ఇరుక్కుపోయారు. ఆ రుణానికి కూడా వారే బాధ్యత వహించాల్సి వస్తోంది. ఇది అత్యంత దారుణమని, రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని తమ సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

ఇసుకలో మిర్చి మాయ

(5వ పేజీ తరువాయి)

సిండికేట్‌గా ఏర్పడ్డారు. వీరి చేతుల్లోకి తిరుమలగిరి కోల్డ్ స్టోరేజీ ప్లాంట్ కూడా చిక్కింది. ఈ కోల్డ్ స్టోరేజీ గతంలో పీఎన్నార్ కోల్డ్ స్టోరేజీగా ఉండేది. అప్పటి యాజమాన్యం వేరు. ఇప్పటి యాజమాన్యం వేరు. పీఎన్నార్ పేరుతో ఉండగానే, కోల్డ్ స్టోరేజీ కార్యకలాపాలు మూతపడ్డాయి. అప్పటికే చాలాకాలం దీనిని నిర్వహించటం వల్ల పాతపడిపోయింది. దీంతో దీని నిర్వహణను అప్పటి యాజమాన్యం పక్కన పెట్టేసింది. కోల్డ్ స్టోరేజీల ద్వారా లాభాలను దండుకోవాలన్న ఉద్దేశంతో జగ్గయ్యపేట ఇసుక సిండికేట్ ఆధ్వర్యంలో మూతపడిన కోల్డ్ స్టోరేజీని చేజిక్కించుకుంది. నిర్వాహకులు ఎవరైనా.. నడిపిస్తున్నది మాత్రం ఇసుక సిండికేట్ అని తెలుస్తోంది. ఈ ప్లాంట్‌ను ప్రారంభించాక ఇసుక సిండికేట్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని గ్రామాలకు వెళ్లి ప్రచారం చేసింది. ఇన్సూరెన్స్ సదుపాయం ఉందని, సరుకు భద్రతకు తమది గ్యారెంటీ అని చెప్పింది. అలా పెద్దసంఖ్యలో రైతుల నుంచి మిర్చిని సమీకరించినట్టుగా తెలుస్తోంది. మొదట్లో ఇన్సూరెన్స్ కల్పించినా.. ఆ తర్వాత రూ.లక్షల్లో ఖర్చవుతుందని ఇన్సూరెన్స్‌ను పునరుద్ధరణ చేయకుండా మానేసింది. దీంతో రైతులు నట్టేట మునిగిపోయారు. ఇన్సూరెన్స్ ఉందని నమ్మబలికి, రైతుల నుంచి మిర్చిని సమీకరించి, వారిని రోడ్డు పాలు చేశారు.

వెలంపల్లి అనుచరుడి అండతోనే..!

- నిషేధిత మందుల విక్రయాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలి
- జిల్లా ఎస్పీకి టీడీపీ నేత వినతి


ఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న కనపర్తి

మచిలీపట్నం టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : నిషేధిత మందుల విక్రయాలపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అవనిగడ్డ భార్గవ్ మందుల షాపు నిర్వాహకుడు కొనకళ్ల రామ్మోహనరావును అరెస్టు చేసిన దృష్ట్యా.. అతడితో సంబంధం ఉన్న మాజీమంత్రి వెలంపల్లి అనుచరుడు మురళీకృష్ణ అలియాస్ కొండపల్లి బుజ్జి విద్యాధర్‌పై సమగ్ర విచారణ జరిపి తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావుకు టీడీపీ నేత కె.శ్రీనివాసరావు బుధవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. భార్గవ్ మెడికల్ షాపు వెనుక వెలంపల్లి హస్తం ఉందని, గత మూడేళ్లుగా ట్రెమడాల్ నిషేధిత మందులతో పాటు మూడువేల ఇంజక్షన్లకు పైగా విక్రయించారని ఆరోపించారు. కొవిడ్ సమయంలో ఈ మందులు విక్రయాల ద్వారా మురళీకృష్ణ కోట్ల రూపాయలు అక్రమంగా సంపాదించాడన్నారు. నిరుపేద కూలీలు, విద్యార్థులకు మందులు విక్రయిస్తున్నట్టు తేలిందన్నారు. కృష్ణాజిల్లా హోల్‌సేల్ డ్రగ్ హోల్డర్ మురళీకృష్ణను అరెస్టు చేస్తే వాస్తవాలు తెలుస్తాయన్నారు.

ప్రగతి.. పురోగతి

(5వ పేజీ తరువాయి)

18 గోడౌన్ల నిర్మాణాలను ఈ ఏడాది సెప్టెంబరులోగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో 800 బోట్లకు ట్రాన్స్‌పాండర్‌లను వచ్చే జూన్ నాటికి ఏర్పాటు చేస్తామన్నారు.

● జిల్లాలో బ్యాంకుల సేవలను మరింతగా పెంచేందుకు మే నెలలోగా ఇండియన్ బ్యాంక్, ఎస్‌బీఐ బ్రాంచ్‌లను ప్రారంభించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద అన్ని పంటలకు పంటబీమా వర్తింపజేయనున్నామన్నారు. మచిలీపట్నంలో స్టార్ హోటల్ నిర్మాణం, బీచ్‌లో రీసార్ట్‌లను నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించామని, దీనికోసం రెండు నుంచి మూడెకరాల భూమిని కేటాయించినట్లు తెలిపారు.

● జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 5 వేల మంది మహిళలకు కేన్సర్ స్క్రీనింగ్ టెస్టులు చేయించేందుకు ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో నేరాలను అదుపు చేసేందుకు 2,715 సీసీ టీవీలు, డ్రోన్ కెమెరాలను వినియోగించనున్నామన్నారు. జిల్లాలో 61 సంక్షేమ వసతి గృహాలకు సెప్టెంబరులోగా మరమ్మతులు చేయడానికి అంచనాలు రూపొందించామని వివరించారు. ఇందులో సాంఘిక సంక్షేమ వసతి గృహాలు 37, బీసీ సంక్షేమ వసతి గృహాలు 24 ఉన్నట్లు తెలిపారు.

● హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతరత్రా వర్తక, వాణిజ్యం ద్వారా వచ్చే ఆదాయం రూ.15,294 కోట్లు ఉండగా, ఈ ఏడాది ఆ రంగాల్లో వృద్ధి రేటును 22.18 శాతం మేర పెంచాలని ప్రణాళిక రూపొందించామని తెలిపారు. రెండు కోల్డ్ స్టోరేజీ పాయింట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. రైల్వే విభాగంలో రూ.168 కోట్ల జీడీవీఏ ఉండగా, రవాణా, ఇతర త్రాల రూపంలో రూ.5,532 కోట్లు ఉందని, ఈ ఏడాది ఆ వృద్ధి రేటును 16.83 శాతానికి పెంచాలని లక్ష్యంగా నిర్ణయించామని తెలిపారు. కమ్యూనికేషన్ విభాగంలో రూ.1,149 కోట్లు ఉండగా, ఈ ఏడాది 17 శాతం వృద్ధిని సాధించాలని ప్రణాళిక రూపొందించామని తెలిపారు. రియల్ ఎస్టేట్, ఇతరత్రాల రూపంలో రూ.5,956 కోట్ల వ్యాపారం ఉండగా, ఈ ఏడాది 18.41 శాతం, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో రూ.2,335 కోట్లు ఉండగా, ఈ ఏడాది 9.89 శాతం మేర వృద్ధిని సాధించాలని నిర్ణయించామన్నారు. విద్య, వైద్యం, రిక్రియేషన్ విభాగాల్లో రూ.4,602 కోట్లు ఉండగా, ఈ ఏడాది 16.72 శాతం వృద్ధిని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. జిల్లా మొత్తంగా క్యాపిటల్ ఇన్‌కమ్ రూ.4,88,310 కోట్లు ఉండగా, 16.54 శాతం మేర వృద్ధిని సాధించాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు.

● ప్రభుత్వ సహకారంతో మచిలీపట్నం పోర్టుకు అనుబంధంగా పరిశ్రమల స్థాపన కోసం ముడా వద్ద 511.95 ఎకరాలు, మరో 7 వేల ఎకరాల సాల్ట్ భూములను సిద్ధంగా ఉంచినట్లు కలెక్టర్ తెలిపారు. అమృత్-1 పథకం ద్వారా మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌లో డ్రెయిన్లకు 122 ప్రాంతాల్లో లింక్‌లను కలిపేందుకు రూ.13.03 కోట్లతో అంచనాలు రూపొందించామన్నారు. ఈ కార్పొరేషన్‌లో డ్రెయిన్ల సమస్య శాశ్వత పరిష్కారం కోసం రూ.164 కోట్ల అంచనాతో ప్రభుత్వానికి నివేదికను పంపామని తెలిపారు. నీటిపారుదల, డ్రెయినేజీ విభాగాల్లో కాల్వల నిర్వహణ కోసం 722 పనులకు రూ.36.72 కోట్లతో అంచనాలను రూపొందించి నివేదికను ప్రభుత్వానికి పంపామని, అనుమతులు రావాల్సి ఉందన్నారు. వ్యవసాయంలో యాంత్రీకరణ కోసం డ్రయ్యర్ సౌకర్యం కోసం ప్రతిపాదనలను పంపామని తెలిపారు.


ఉగాది పురస్కార గ్రహీతలతో కేయు వీసీ రాంజీ

కృష్ణా విశ్వవిద్యాలయంలో యోగా, చిత్రకళ, కూచిపూడి కోర్సులు!

- సేవారత్న అవార్డుల ప్రదానోత్సవంలో ఉపకులపతి రాంజీ

మచిలీపట్నం టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా విశ్వవిద్యాలయంలో యోగా, చిత్రకళ, కూచిపూడి సర్టిఫికెట్ కోర్సులను త్వరలో ప్రవేశపెడతామని ఉపకులపతి ఆచార్య కూన రాంజీ వెల్లడించారు. బుధవారం రాత్రి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్టార్‌ప్లస్ స్కూల్‌లో వివిధ రంగాల్లోని ప్రముఖులకు మానవత ఉగాది పురస్కారాలను అందజేశారు. ప్రముఖ విద్యావేత్త దిట్టకవి వెంకటేశ్వరరావుకు విద్యాసేవారత్న, ప్రముఖ వైద్యుడు ఎం.మధుసూదనరావుకు వైద్యసేవారత్న, గొర్రెపాటి గోపీచంద్‌కు సామాజిక సేవారత్న, కృష్ణాజిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మద్దుల గిరీష్‌కు వాణిజ్యరత్న, విశ్రాంత ఎల్ఐసీ డీవో పి. మోహనరావుకు ఉద్యోగసేవారత్న అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఉపకులపతి మాట్లాడుతూ, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సేవలను కొనియాడారు. మానవత స్వచ్ఛంద సేవాసంస్థ మచిలీపట్నంశాఖ అధ్యక్షుడు పి.శ్రీరామ్, బండి రామకృష్ణ, లంకిశెట్టి బాలాజీ తదితరులు మాట్లాడారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

మచిలీపట్నం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల ద్వారా డీఎస్సీ ఉచిత శిక్షణ కోసం ఈనెల 28వ తేదీలోగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సాంఘిక సంక్షేమశాఖ జేడీ షాహిద్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫేజ్-2లో ఎంపికైన అభ్యర్థులు జ్ఞానభూమి పోర్టల్‌లో ఎంప్యానెల్‌లో తాము కోరుకున్న విద్యాసంస్థలను ఎంపిక చేసుకోవాలని ఆయన కోరారు.

కుప్పకూలిన కోల్డ్ స్టోరేజి

- అదుపులోకి వచ్చిన మంటలు
- రెండోరోజు ఫైరింజన్లు, యంత్రాలతో ఆపరేషన్

జగ్గయ్యపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : అగ్నిప్రమాదానికి గురైన సాయి తిరుమలగిరి కోల్డ్ స్టోరేజీలో బుధవారం సాయంత్రానికి మంటలు అదుపులోకి వచ్చాయి. అగ్నిమాపక అధికారులు లిక్విడ్ సీఓ2 తెప్పించి కోల్డ్ స్టోరేజీలోకి పంపటంతో నియంత్రణలోకి వచ్చింది. మంగళవారం రాత్రి కొంత భాగం కూలిపోగా, బుధవారం ఉదయం మిర్చి నిల్వ ఉంచిన భాగం ఒక్కసారిగా కూలిపోయింది. ముందస్తుగా ఫైర్, పోలీస్ అధికారులు ఎవరిని ఆ ప్రాంతంలోకి రాకుండా కట్టడి చేశారు. బుధవారం ఫైర్‌సర్వీసెస్ రీజినల్ ఆఫీసర్ స్వామి, జిల్లా ఫైరాఫీసర్ శంకర్రావు ఆధ్వర్యంలో ఆపరేషన్ పూర్తి చేశారు. బుధవారం రాత్రికి మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

కోల్డ్ స్టోరేజి యజమానిపై కేసు నమోదు

కోల్డ్ స్టోరేజి యజమాని రావూరి శ్రీనివాసరావుపై జగ్గయ్యపేట తహసీల్దార్ మనోహర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ పి.వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం ఉదయం గం.4-30ని.లకు ఫైర్ అధికారులు తొర్రగుంటపాలెంలోని సాయి తిరుమలగిరి కోల్డ్ స్టోరేజిలో అగ్ని ప్రమాదం జరిగిందని తెలియజేయగా అక్కడకు వెళ్లానని, సుమారు రూ.10 కోట్లు విలువైన మిర్చి, అపరాలు దగ్ధమయ్యాయని, కోల్డ్ స్టోరేజి రావూరి శ్రీనివాసరావుకు చెందిందని ఆయన ఫిర్యాదు చేశారని సీఐ తెలిపారు.

300 మంది రైతులు 35వేల టిక్కీలు..

- రెవెన్యూ అధికారుల ప్రాథమిక సర్వే గణాంకాలు

జగ్గయ్యపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : తొర్రగుంటపాలెం కోల్డ్ స్టోరేజీలో రెండు రోజులుగా రెవెన్యూ అధికారులు కోల్డ్ స్టోరేజి వద్ద ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌లో బుధవారం సాయంత్రానికి 300 మంది రైతులు తమ వద్ద ఉన్న రసీదులను నమోదు చేయించుకున్నట్టు జగ్గయ్యపేట తహ సీల్దార్ మనోహర్ చెప్పారు. ఇప్పటి వరకు వచ్చిన రసీదుల ఆధారంగా 35వేలు టిక్కీలు మిర్చి నిల్వ చేసినట్టు తేలిందని తెలిపారు. ఇంకా అనేక మంది రైతులు తమ వద్ద ఆధారాలు తీసుకోని రావాల్సి ఉంటుందని ఆయన చెప్పారు.

28లోగా ఫేజ్-2 వెబ్‌ఆప్షన్లు ఇవ్వాలి

- జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి శ్రీనివాస శిరోమణి

కలెక్టరేట్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఉచిత డీఎస్సీ కోచింగ్‌కు షార్ట్ లిస్ట్ చేయబడిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల జాబితా హెచ్‌టీటీపీఎస్://ఎండీఎఫ్‌సీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ పోర్టల్‌లో వుందని, జాబితాలోని అభ్యర్థులు ఈనెల 28లోగా ఫేజ్-2 ఆప్షన్‌ను సర్వీస్ ద్వారా ఎంప్యానెల్డ్ కోచింగ్ సంస్థలకు తమ ప్రాధాన్యతలు ఇవ్వాలని జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి కె.శ్రీనివాస శిరోమణి బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. వెబ్‌ఆప్షన్ల ప్రక్రియ ద్వారా అభ్యర్థులు అన్ని కోచింగ్ సంస్థలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ దశలో ఫేజ్-1 వెబ్ ఆప్షన్లను సవరణకు వీలుపడదని తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	120, 129, 140
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 415

ఉయ్యూరులో ప్రజాసామాజిక తనిఖీ



కార్యక్రమంలో ఉపాధి పనుల వివరాలు తెలియజేస్తున్న ఎంపీడీవో శేషగిరిరావు

ఉయ్యూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరులో 16వ విడత సామాజిక తనిఖీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జీఎస్వీ శేషగిరిరావు మాట్లాడుతూ, 11 గ్రామాల్లో నిర్వహించిన ఉపాధి హామీ పథకంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో సీసీ రోడ్లు, గ్రామ సచివాలయాలు, పంటబోదుల పూడికతీత, మట్టిపనులు, నీటి ఇంకుడుగుంతలు వంటి మొత్తం పనిదినాలు 1,86,352 విలువ ఆరు కోట్ల నలభైఐదువేలుగా తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ శివప్రసాద్ యాదవ్, అంబుడ్స్‌మన్ వెంకట శ్రీనివాసరావు, విజిలెన్స్ విభాగం సురేష్, జేక్యూసీ జయప్రకాష్, ఏపీవో నాగరాజు పాల్గొన్నారు.

పట్టుకోల్పోతోంది!

- వెలవెలబోతున్న జంక్షన్ పట్టుగూళ్ల విక్రయ కేంద్రం
- నానాటికి దిగజారుతున్న విక్రయాలు
- ఉపాధి కోల్పోతున్న రీలర్లు



గూళ్లు రాక వెలవెలబోతున్న జంక్షన్ పట్టుగూళ్ల విక్రయ కేంద్రం

(హనుమాన్‌జంక్షన్ - ఆంధ్రజ్యోతి)

పట్టుగూళ్ల ఉత్పత్తి చేసే రైతులకు గిట్టుబాటుధర, రీలర్లుకు ఉపాధిని అందిస్తూ, మార్కెట్ కేంద్రంగా ఒకనాడు భాసిల్లిన జంక్షన్ పట్టుగూళ్ల విక్రయ కేంద్రం నేడు క్రయ విక్రయాలు సన్నగిల్లి వెలవెలబోతుంది. గతేడాది జరిపిన విక్రయాల్లో 50శాతం కూడా గడిచిన పది మాసాల్లో జరగని పరిస్థితి నెలకొంది. మూడు దశాబ్దాల కిందట ఇక్కడ నెలకొల్పిన పట్టుగూళ్ల విక్రయకేంద్రం ఉత్తర కోస్తా ప్రాంతంలోని రైతులకు బాసటగా నిలుస్తూ వచ్చింది. ఈ ఏడాది పట్టుగూళ్ల ఉత్పత్తి గణనీయంగా పడిపోడంతో మార్కెట్‌లో పట్టుగూళ్ల రాకపోవడంతో దాని మీద ఆధారపడ్డ రీలర్లు నిరాశకు గురవుతున్నారు. జంక్షన్ మార్కెట్ యార్డు మీద జంక్షన్, తేలప్రోలు, మీర్జాపురం, నూజివీడు ప్రాంతాల్లోని పట్టుదారం తీసే రీలర్లు ఆధారపడి ఉన్నారు. జంక్షన్ మార్కెట్‌కు పట్టుగూళ్ల విక్రయాలు తగ్గుముఖం పట్టడంతో ఉపాధి కోల్పోయి ఇబ్బంది పడుతున్నారు. జంక్షన్ విక్రయ కేంద్రానికి అనుసంధానంగా గతంలో దారం తీసే 20 చర్కా యూనిట్లు ఉండేవి. క్రమేణా మూతపడ్డాయి. మార్కెట్‌కు పట్టుగూళ్ల రాకపోవడంతో రీలర్లు వ్యవసాయ కూలీలుగా మారి ఉపాధిని వెతుక్కుంటున్న పరిస్థితి నెలకొంది. రీలర్లుకు అవసరమైన మేరకు గూళ్లు రాకపోవడంతో వచ్చిన పట్టుగూళ్లకు పోటీ ఏర్పడుతోంది. దీంతో ధర పెరిగి రైతులకు ఊరట ఇస్తోంది. గరిష్ఠంగా బైవోల్టిన్ గూళ్లకు ఈ నెలలో టన్ను సగటున రూ. 700లు పలకడం విశేషం. రీలర్ల డిమాండ్‌కు తగ్గట్టుగా గూళ్లు రాకపోవడంతో నిరుత్సాహానికి గురవుతున్నారు.

మల్బరీ సాగుపై పురుగు మందు ప్రభావం

జిల్లాతో పాటు ఇతర జిల్లాల్లో సాగు చేస్తున్న మల్బరీ తోటలపై పురుగుమందు ప్రభావం ఎక్కువగా ఉండడంతో పట్టుగూళ్ల ఉత్పత్తి గణనీయంగా పడిపోయిందని జంక్షన్ మార్కెట్ అధికారి టీవీ వసంతరావు తెలిపారు. మల్బరీ సాగు సమీపంలో మొక్కజొన్న, మామిడి, ఇతర వాణిజ్య పంటలు సాగు చేస్తున్న రైతులు తమ పంటను కాపాడుకోవడానికి పిచికారి చేసే పురుగుమందు మల్బరీ తోటలకు వ్యాపించి పట్టుపురుగులు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందన్నారు. పురుగుమందు పడిన ఆకులు తిన్న పురుగులు ఆరోగ్యం దెబ్బతిని నాణ్యమైన గూళ్లను, అధిక ఉత్పత్తిని చేయలేక పోతుండడంతో దిగుబడి తగ్గిందన్నారు.

రీలర్లను ఆదుకోవాలి



గతంలో 20 మంది రీలర్లు పట్టుదారం తీసి ఉపాధి పొందేవాళ్లం. నేడు ఇక్కడ 5గురు రీలర్లు మాత్రమే పని చేస్తున్నా రు. వారికి కూడా గూళ్లు సక్రమంగా అందడం లేదు. 2022 నుంచి రీలర్లకు ప్రోత్సాహకాలు విడుదల చేయలేదు. చర్కా మీద తీసే పట్టుకు కిలోకు రూ.35, మల్టీఎండ్‌మిషన్ మీద తీసే రీలర్లకు రూ.130 చొప్పున ప్రోత్సాహకాలు ఇవ్వాలి.

\- మాగంటి రామకృష్ణ, రీలరు

తాడిగడప మునిసిపాలిటీ అభివృద్ధికి కృషి

ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే బోడె ప్రసాద్



ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : వచ్చే నాలుగేళ్లలో తాడిగడప మునిసిపాలిటీని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పిస్తామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. బుధవారం తాడిగడప మునిసిపల్ కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక.ప్రజాదర్బార్‌లో ఆయన పాల్గొని వివిధ సమస్యలపై ప్రజల వినతులను స్వీకరించి పరిష్కారాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధి కోసం, పిల్లల చదువుల కోసం గ్రామాల నుంచి వస్తున్న వలసల కారణంగా తాడిగడప మునిసిపాలిటీ జనసాంద్రత విపరీతంగా పెరుగుతుండడంతో సమస్యలు కూడా పెరుగుతున్నాయన్నారు. వైసీపీ పాలనలో మునిసిపాలిటీని ఏర్పాటు చేశారేగానీ.. రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలు జరగకపోవడం, ఒక ప్రణాళిక ప్రకారం మునిసిపాలిటీ అభివృద్ధి జరగకపోవడం వల్ల సమస్యలు ఎక్కువగా ఉంటున్నాయన్నారు.

ప్రజా దర్బార్‌లో అర్జీల వెల్లువ

ప్రజా దర్బార్‌కు అర్జీలు వెల్లువలా వచ్చాయి. వాటి పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సూచించారు. ఇంటికి సంబంధించిన అన్ని డాక్యుమెంట్లు అధికారులకు ఇచ్చినా.. ఇంటిపన్ను అప్‌డేట్ చేయకపోవడంతో పన్ను ఎక్కువ వస్తోందని లబ్ధిదారుడు విన్నవించగా దీన్ని ఎందుకు సరిచేయలేదంటూ అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. కానూరు అమరావతి కాలనీవాసులు, తాడిగడప షిర్డీసాయినగర్ వాసులు తమ ప్రాంతంలో సీసీ రోడ్డు, డ్రెయినేజీ అభివృద్ధి చేయాలని విన్నవించారు. పోరంకి బీఎస్ఎన్ఎల్ రోడ్డువాసులు డ్రెయిన్లు అభివృద్ధి చేయాలని కోరారు. పలు సమస్యలను సావధానంగా విన్న ఎమ్మెల్యే వెంటనే తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దండి : డీపీవో అరుణ



గోసాలలో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో అరుణ

గోసాల (కంకిపాడు), మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : చెత్త రహిత గ్రామాలుగా ప్రతి గ్రామాన్ని తీర్చి దిద్దేందుకు ప్రభుత్వ అధికారులకు ప్రజలు సహకరించాలని జిల్లా పంచాయతీ అధికారి డాక్టర్ జె. అరుణ అన్నారు. పెనమలూరు మండలంలోని గోసాల గ్రామంలో బుధవారం ఆమె విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాను చెత్త రహితంగా తీర్చిదిద్దాలంటే గ్రామ స్థాయి నుంచి పనిచేయాల్సిన అవసరముందన్నారు. చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలన్న సీఎం చంద్రబాబు ఇచ్చిన టార్గెట్‌ను నెరవేర్చేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ బొబ్బసాని శ్రీనివాసు, ఈవో కూర్మారావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

వరిగడ్డి ట్రాక్టర్ దగ్ధం

ఉంగుటూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ తీగలు తగిలి వరిగడ్డి ట్రాక్టర్ పూర్తిగా దగ్ధమైన సంఘటన మండలంలోని వెన్నూతలలో బుధవారం సాయంత్రం జరిగింది. పొలం నుంచి వరిగడ్డి లోడుతో వస్తున్న ట్రాక్టరు ప్రధాన రోడ్డు ఎక్కే క్రమంలో విద్యుత్ తీగలు తగలడంతో అగ్నిప్రమాదం సంభవించింది. వరిగడ్డికి పూర్తిస్థాయిలో మంటలు వ్యాపించడంతో ట్రక్కుతో సహా దగ్ధమైంది

పేద మహిళలకు చీరల పంపిణీ



హనుమాన్‌జంక్షన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పేద వారిని ఆదుకున్నపుడే మానవత్వం పరిడవిల్లుతుందని సయ్యద్ తాజ్ ఉద్దీన్ బాబా ట్రస్ట్ చైర్మన్ మహమ్మద్ అక్బర్ షరీఫ్ సూఫీ తెలిపారు. రంజాన్ మాసం పురస్కరించుకొని బుధవారం బాపులపాడు ఎంజీనగర్ కాలనీలోని పేద మహిళలకు ట్రస్టు ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు రహీం, ఇబ్రహీం, మసీదు కమిటీ సభ్యులు తదిరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల నిరసన ర్యాలీ

గన్నవరం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రిలో పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని కోరుతూ క్రైస్తవులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాన్ని బుధవారం అందజేశారు. తొలుత పట్టణంలో నిరసన ర్యాలీ జరిపారు. రాచేటి మురళీ మాట్లాడుతూ, పాస్టర్ ప్రవీణ్ మృతిపై ప్రత్యేక దర్యాప్తు జరపాలని కోరారు.

అమ్మవారి ఆశీస్సులు అందరికి ఉండాలి

లక్ష్మీ తిరుపతమ్మ కల్యాణ వేదిక ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



లక్ష్మీ తిరుపతమ్మ కల్యాణ వేదికను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధనరావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్

గన్నవరం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పాత గన్నవరంలోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ దేవస్థానం ఆవరణలో జాస్తి చౌదరయ్య, సుశీలదేవి సౌజన్యంతో నూతనంగా నిర్మించిన కల్యాణ వేదికను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకట బాల వర్ధనరావు, ఆలయ కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్‌లతో కలసి బుధవారం ప్రారంభించారు. తొలుత లక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, చౌదరయ్య, సుశీలదేవి సౌజన్యంతో పాటు అమ్మవారి భక్తుల సహాయ సహకారాలతో కల్యాణ వేదికను సకల సౌకర్యాలతో నిర్మించటం అభినందనీయమన్నారు. లక్ష్మీ తిరుపతమ్మ కల్యాణ వేదికకు తనవంతుగా రూ.2లక్షలు విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. అమ్మవారి ఆశీస్సులు అందరికి ఉండాలని ఆకాంక్షించారు. అందరికి ఉపయోగపడే కళ్యాణ వేదిక అవసరమన్నారు. లక్ష్మీ తిరుపతమ్మ కల్యాణ వేదిక నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆలయ కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్ కృతజ్ఞతలు తెలిపారు. భక్తులకు అన్నప్ర సాద వితరణ జరిపారు. తహసీల్దార్ కేవీ శివయ్య, సర్పంచ్ నిడమర్తి సౌజన్య, వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, ఉప సర్పంచ్ పాలడుగు నాని, మాజీ సర్పంచ్ గూడపాటి తులసిమోహన్, ఏఎంసీ మాజీ చైర్మన్ కోటగిరి ప్రసాదరావు, కాసన్నేని రంగబాబు, తుల్లిమిల్లి ఝాన్సీ, జాస్తి ఫణిశేఖర్, కాసన్నేని నాని, నర్రా గిరి, జాస్తి శ్రీను తదిరులు పాల్గొన్నారు.

గన్నవరం సెంటర్ ఆధునికీరణకు చర్యలు

గన్నవరం సెంటర్ను రెండు నెలల్లో ఆధునీకరించనున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. సెంటర్‌లో ఉన్న గాంధీజీ, ఎన్టీఆర్ విగ్రహాల స్థానాల్లో సరికొత్త కాంస్య విగ్రహాలు ఏర్పాటు చేసి నయా లుక్ వచ్చే విధంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. బుధవారం గాంధీజీ కాంస్య విగ్రహ ఏర్పాటుకు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రూ.4.50 లక్షల విరాళాన్ని అందజేశారు. మడుపల్లి బాలకృష్ణమూర్తి, కుర్మాల సత్య శ్రీనివాస్‌కుమార్, మోటమర్రి శేఖర్, జి.బాలశంకర్, జి.యజ్ఞ నారాయణ, కందగడ్డల శ్రీనివాసరావు, తాడికొండ ప్రసాద్, అప్పల ప్రసాద్, మడుపల్లి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రుణాలకు దరఖాస్తుల పరిశీలన

హనుమాన్‌జంక్షన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : బీసీ కార్పొరే షన్ ద్వారా 50 శాతం సబ్సిడీ రుణాలు పొందడానికి మండలంలో బీసీ, ఈబీసీ వర్గాల నుంచి 92 దరఖాస్తులు అందినట్లు బాపుల పాడు ఎంపీడీవో కె.జోగేశ్వరరావు తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ గడువు మంగళవారంతో ముగిసిందని బీసీ అన్ని కేటగిరిల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఆయా బ్యాంకులకు పంపించడం జరుగు తుందని తెలిపారు. గరిష్ఠంగా ఒక్కొక్క యూనిట్‌కు రూ.5లక్షలు వరకు రుణ సదుపాయం పొందవచ్చని తెలిపారు.

పన్నులు సకాలంలో చెల్లించాలి

హనుమాన్‌జంక్షన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : నీటి కుళాయి పన్ను సకాలంలో చెల్లించి గ్రామ పంచాయతీకి సహకారం అందించాలని బాపులపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎస్.పూర్ణేశ్వరి బుధవారం ఒక ప్రకటనలో ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కేవలం నీటి కుళాయి పన్ను గ్రామంలో రూ1.20కోట్లు బకాయిలు ఉన్నట్లు తెలిపారు. పన్ను బకాయిలు చెల్లించి గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజాపోరాటాలకు స్ఫూర్తి అచ్చెన్నాయుడు



హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రజా సమస్యలపై పోరాటం చేసి మంత్రిగా రైతులకు అచ్చెన్నాయుడు అంది స్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికల్యాణి కొనియాడారు. విజయవాడలోని మంత్రి అచ్చెన్నాయుడు గృహంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శ్రీవెంకటేశ్వస్వామి వారి చిత్రపటాన్ని అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మూల్పూరి సురేంద్ర, పొట్లూరి వెంకట సుధీర్ పాల్గొన్నారు.

పోలవరం గట్టు చదునుపై స్థానికుల ఆగ్రహం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : రేమల్లెలోని పోలవరం గట్టుపై పిచ్చి మొక్కలు, తుప్పల వల్ల కోతులతో పంటలకు నష్టం వాటిల్లతుందనే కారణంతో రైతు మొక్కలు తొలగించి చదును చేస్తుండటంతో స్థానికులు బుధవారం అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై తహసీల్దార్ మురళీకృష్ణకు ఫిర్యాదు చేశారు. అనుమతి లేకుండా గట్టు చదును చేయరాదని హెచ్చరిస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలించాలని వీఆర్‌ఓ నాగమణికి ఆదేశాలు జారీ చేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలించిన వీఆర్‌ఓ చదును చేయడం ఆపివేయించి ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ అధికారులకు సమాచారం అందించారు. జలవనరులశాఖ అధికారి బ్యూలా క్షేత్రస్థాయిలో పరిశీలించి జేసీబీని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు.

12నుంచి తేలప్రోలు శ్రీరంగమ్మ పేరంటాలు తిరునాళ్ల

ఉంగుటూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : రైతుల పాలిట ఇలవేల్పుగా, నమ్మిన భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారు తల్లిగా కొలువబడుతున్న తేలప్రోలులోని శ్రీరంగమ్మ పేరంటాలు అమ్మవారి తిరునాళ్లు(మహోత్సవాలు) ఏప్రిల్ 12నుంచి 15వరకు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయవారసులు, జక్కాసోదరులు చంద్రశేఖర్, ఉదయ్, రమేష్ బుధవారం తెలిపారు. బుధవారం రాత్రి నుంచి అమ్మవారిని గుడి నుంచి బయటకు తీసుకు వస్తారు. అప్పటి నుంచి ఏప్రిల్ 10 వరకు బయటే పూజలు కొనసాగిస్తారని, 11న అమ్మవారు తిరిగి గుడిలోకి ప్రవేశించిన అనంతరం అంకగుడారి వేయడంతో ఉత్సవాలకు అంకురార్పణ జరుగుతుందన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఫణి దూర్జటి


విద్యతోనే సమాజంలో గౌరవం

సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా కో ఆర్డినేటర్ ఫణి దూర్జటి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : చదువుతో పాటు సమాజ జ్ఞానంతోనే విద్యార్థులు సర్వతో ముఖాభివృద్ధి చెందుతారని క్రమశిక్షణతో కూడిన విద్య ద్వారా మాత్రమే సమాజంలో గౌరవం సాధ్యమని సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా కో ఆర్డినేటర్ ఫణి దూర్జటి సూచించారు. వేలేరులోని నేతాజీ సుభాస్ చంద్రబోస్ ఆవాసీయ విద్యాలయ వార్షికోత్సవ సందర్భంగా బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో రాంబాలాసింగ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత, మాజీ జెడ్పీటీసీ సుంకర సుభాస్‌చంద్రబోస్, స్థలదాత అవిర్నేని రాధాకృష్ణ అబ్దుల్ సుబాన్, రాంబాబు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

ఉయ్యూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని కమాండింగ్ కల్నల్ బాలిందర్ సింగ్ అన్నారు. శ్రీశ్రీనివాస అక్షరాలయం ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఫైరింగ్ రేంజ్ కార్యక్రమాన్ని నిర్వహిచారు. శ్రీనివాస గ్రావిటి ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ చైర్మన్ పరుచూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఐ టి.వి.వి రామారావు, ఎస్సైలు విశ్వనాథ్, సురేష్‌బాబు, ప్రిన్సిపాల్ నీలిమ పాల్గొన్నారు.



రుద్రరాజుకు స్వాగతం పలుకుతున్న నాయకులు

కాంగ్రెస్ నేత రుద్రరాజుకు ఘనస్వాగతం

గన్నవరం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజుకు గన్నవరం విమానాశ్రయంలో కాంగ్రెస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. హైదరాబాద్ నుంచి ఇండిగో విమానంలో ఇక్కిడికి వచ్చిన రుద్రరాజుకు పీసీసీ జనరల్ సెక్రటరీ మేడా సురేష్, మాజీ జనరల్ సెక్రటరీ పోతురాజు ఏసుదాసు, ధనేకుల మురళీమోహన్, అశోక్ శరన్, అన్సారి, ఎన్.సుభాష్, రవి తదితరులు దుశ్శాలువ కప్పి స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

నీటికష్టాలకు చెల్లుచీటి..!

● ఏఐఐబీ ప్రాజెక్ట్ నిర్మాణానికి రూ.89కోట్లు కేటాయింపు ● ప్రాజెక్టు పూర్తయితే రోజూ మంచినీరు ● ఫలించిన ఎమ్మెల్యే సౌమ్య, అధికారుల కృషి

పట్టణ ప్రజలకు కూటమి ప్రభుత్వం గొప్ప బహుమతినిచ్చింది. మంచినీటి పథకం నిర్మాణానికి రూ.89కోట్లు కేటాయించింది. నిరంతరాయంగా స్వచ్ఛమైన మంచినీటిని అందించి ప్రజల జీవన ప్రమాణాలు పెంచనుంది. ఆర్‌వో వాటర్ తరహా శుద్ధి చేయబడిన నీటిని ప్రతి గడపకూ నడిపేందుకు చర్యలు చేపట్టింది. వారానికి రెండు పర్యాయాలు మాత్రమే మంచినీరు అందుకొనే ప్రజలకు నిత్యం తలకు 135 లీటర్ల నీటిని అందించనున్నారు. పట్టణ జనాభా శరవేగంగా పెరుగుతున్న నేపథ్యంలో 2050 నాటి జనాభాను అంచనా వేసుకొని ఈ పథకాన్ని డిజైన్ చేశారు. అభివృద్ధి చెందిన నగరాలకు కూడా లేని సౌకర్యం పట్టణ ప్రజలకు చేరువ కానుంది. ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పట్టుదల, కమిషనర్ రమణబాబు, ఏఈ ఫణిశ్రీనివాస్ సమయస్ఫూర్తితో ఈ ప్రాజెక్ట్ నందిగామకు వచ్చిందనడంలో ఎటువంటి సందేహం లేదు.

- ఆంధ్రజ్యోతి-నందిగామ

నందిగామ పట్టణం.. పంచాయతీ నుంచి మునిసిపాలిటీగా మారినా 3 దశాబ్దాల నాటి మంచినీటి పథకాలే నేటికీ ఆధారం. జనాభా మాత్రం రెట్టింపైంది. పట్టణ జనాభాతో పాటు నిత్యం వేలాది మంది అనేక పనుల నిమిత్తం ఇక్కడికి వచ్చి వెళుతుంటారు. దీంతో మంచినీటి వినియోగం భారీగా పెరిగింది. కీసర, మునేరు, కాట్రేనిపల్లి పథకాల నుంచి వచ్చే కొద్దిపాటి నీటిని ప్రాంతాల వారీగా పంపిణీ చేస్తున్నారు. దీంతో వారానికి రెండ్రోజులు మాత్రమే నీటిని ఇవ్వగలుగుతున్నారు. తలకు 135 లీటర్లు ఇవ్వాల్సి ఉండగా, సరాసరి 50 లీటర్లు కూడా ఇచ్చే పరిస్థితి లేదు. మంచినీటి పథకాలు, పైప్‌లైన్లు సామర్థ్యాన్ని కోల్పోతూ నిత్యం మరమ్మతులకు గురౌతున్నాయి. పట్టణ జనాభాకు నిత్యం 7.6 లక్షల లీటర్ల నీరు అవసరం ఉంది. కానీ కేవలం 3లక్షల లీటర్ల నీరు మాత్రమే వస్తున్నాయి. ఇప్పుడు ఏఐబీ ప్రాజెక్ట్ పూర్తయితే పట్టణ అవసరానికి మించి 10 లక్షల లీటర్ల శుద్ధి చేసిన నీరు అందనుంది.

చంద్రబాబు దార్శనికత

శుద్ధి చేయబడిన నీరు ప్రజలకు అందించాలన్న ఆలోచనతో 2014-19 మధ్య పలు మునిసిపాలిటీలకు అప్పటి టీడీపీ ప్రభుత్వం ఆసియా పెట్టుబడులు, మౌలిక వసతుల బ్యాంక్ (ఏఐఐబీ) ద్వారా భారీ మంచినీటి పథకాలు నిర్మించ తలపెట్టారు. అందుకు అనుగుణంగా డీపీఆర్‌లు తయారుచేసి పంపారు. ఒప్పందాలు, అనుమతుల సమయంలో ఎన్నికల కోడ్ రావడం, ప్రభుత్వం మారిపోవడంతో ఈ పథకాలకు గ్రహణం పట్టింది. వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నిర్మాణాలు నిలిచిపోయాయి. ప్రస్తుతం చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావడంతో మరోమారు ఈ పథకంపై ఎమ్మెల్యే సౌమ్య దృష్టి మళ్లింది. కొత్తగా డీపీఆర్ పంపగా అన్ని నిధులివ్వలేమని, రివైజడ్ డీపీఆర్ పంపాలని బ్యాంక్ అధికారులు కోరారు. దీంతో రివైజ్‌డ్ డీపీఆర్ తయారీలో స్థానిక ఎమ్మెల్యే పట్టుదల, అధికారుల నైపుణ్యం చూపించడంతో బ్యాంక్ అధికారులు సంతృప్తి చెంది ప్రాజెక్ట్ నిర్మాణానికి రూ.89కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది



శివారు ప్రాంతాలకు ట్యాంకర్లతో నీటిని అందిస్తున్న మునిసిపాలిటీ

ప్రాజెక్ట్ వివరాలు

కృష్ణానదిలో అత్యంత లోతైన ప్రదేశం గుడిమెట్ల వద్ద ఈ పథకం నిర్మాణానికి నిర్ణయించి ఇన్‌టెక్‌వెల్ నిర్మాణం చేస్తారు. మండు వేసవిలోనూ ఇక్కడ భారీగా నీటి నిల్వలుంటాయి. అక్కడ నుంచి 10 ఎల్‌ఎండీ నీటిని నందిగామ శివారు అనాసాగరంలో ఏర్పాటు చేసే 10 ఎంఎల్‌డి సామర్థ్యం గల మంచినీటి శుద్ధి పరిశ్రమ వద్దకు చేరుకుంటాయి. అక్కడ శుద్ధి చేసిన నీరు అనాసాగరం వద్ద వెయ్యి కిలో లీటర్ల రిజర్వాయర్‌కు, ఉమా కాలనీ వద్ద 800 కిలోలీటర్ల సామర్థ్యం గల రిజర్వాయర్‌కు, ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ వద్ద ఉన్న 700 కిలోలీటర్ల రిజర్వాయర్‌కు సరఫరా అవుతుంది. వాటి నుంచి నేరుగా ప్రతి ఇంటికీ తాగునీరు చేరనుంది.

పటిష్ఠమైన పైప్‌లైన్ వ్యవస్థ

పట్టణంలో కేవలం 600 కిలోమీటర్ల మేర పైప్‌లైన్‌లు ఉన్నాయి. వాటి సామర్థ్యం పూర్తిగా తగ్గిపోవడంతో వాటి స్థానంలో కొత్త పటిష్ఠమైన పైప్‌లైన్ నిర్మాణం జరగనుంది. అంతేకాక కొత్తగా 106 కిలోమీటర్ల పైప్‌లైన్ ఏర్పాటు చేయనున్నారు. దీంతో పట్టణంలోని 14 వేల నివాస గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇవ్వనున్నారు. రానున్న 5 దశాబ్దాల పాటు ప్రజలకు సేవలందించాల్సిన ఈ పథకం నిర్మాణ పనులను సమర్థత ఉన్న సంస్థకు అప్పగించాల్సి ఉంది. అనుభవం లేని రాజకీయ నేతలకు పనులు అప్పగించకుండా నాణ్యతా ప్రమాణాలపై అవగాహన, అధునాతన నిర్మాణ పరికరాలున్న కంపెనీలకు అప్పగించాలి.



బాడీ బిల్డింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో గొట్టిపాటి, అశోక్

జాతీయ బాడీ బిల్డింగ్ పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు

పెనమలూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బిలాస్‌పూర్‌లో ఈనెల 29, 30న ఐబీబీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జూనియర్ నేషనల్ బాడీబిల్డింగ్ పోటీలకు కృష్ణా, ఎన్టీఆర్ జిల్లా నుంచి పలువురు క్రీడాకారులు హాజరు కానున్నారు. బుధవారం కానూరు అశోక్‌జిమ్‌లో క్రీడాకారులకు అభినందన సభ నిర్వహించారు. 55 కిలోల విభాగంలో దినేష్‌రెడ్డి, 60 కిలోల విభాగంలో దినేష్, 65 కిలోల విభాగంలో కే హరి, 75 కిలోల విభాగంలో గోపీచంద్ పోటీలకు ఎంపికైనట్టు జిమ్ నిర్వాహకుడు అశోక్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను ఉమ్మడి జిల్లాల బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఛైర్మన్ గొట్టిపాటి వెంకట రామకృష్ణప్రసాద్, గౌరవాధ్యక్షుడు ఈదా రాజేష్, అధ్యక్షుడు మనోహర్, వేమూరి బాలకృష్ణ, వినోద్ అభినందించారు.

నగర క్రీడాకారిణికి స్వర్ణ, కాంస్య పతకాలు

విజయవాడ స్పోర్ట్స్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లో జరిగిన 1వ సౌత్ ఏషియన్ సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో మహిళల టీమ్ విభాగంలో భారత జట్టు స్వర్ణపతకం సాధించింది. విజయవాడకు చెందిన క్రీడాకారిణి ఎస్.అనూష ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రాతినిథ్యం వహించిందని ఏపీ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డి.దిలీప్ కుమార్ తెలిపారు. టీమ్ విభాగంలో బంగారు పతకం, డబుల్స్, మిక్సిడ్ డబుల్స్ విభాగాల్లో రెండు కాంస్యాలు కైవసం చేసుకున్న అనూషకు శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఛైర్మన్ దారం నవీన్ కుమార్ అభినందనలు తెలిపారు.

పీఎం అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

భారత ప్రభుత్వం, ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆన్‌లైన్‌లో జాతీయ, అంతర్జాతీయ యోగా అభివృద్ధికి, ప్రమోషన్‌కు అత్యుత్తమ సహకారం అందించినందుకు 2025 సంవత్సరానికి గాను యోగాకు సంబంధించి ప్రధానమంత్రి అవార్డులకు దరఖాస్తులను కోరుతున్నట్టు శాప్ ఛైర్మన్, ఎండీ గిరిషా తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని అర్హులైనవారు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఈనెల 30 లోపు పంపాలన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ మురళీకృష్ణ, ఎస్సై సందీప్, సురేష్ బాబు

మోటార్లు, కరెంటు వైర్లు, ట్రాన్స్‌ఫారం దొంగల అరెస్టు

కంకిపాడు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మోటార్లు, కరెంటు వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలను అదుపులోకి తీసుకొని కోర్టు ముందు హాజరు పరిచినట్టు గన్నవరం సబ్ డివిజన్ డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విలాసాలకు అలవాటు పడి పంబి శ్రీను, ముత్యాల గోపాలకృష్ణ, వెన్న దుర్గాప్రసాద్ దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. ఈ క్రమంలో మోటార్లు వైర్లు, ట్రాన్స్‌పార్మర్లను దొంగిలిస్తున్నారని తెలిపారు. వీరిని అదుపులోకి తీసుకొని వీరి నుంచి 216 మోటార్లు, 7 ట్రాన్స్‌ఫార్మర్లు, 2400 మీటర్లు, 300 కేజీల రాగి వైరును స్వాధీన చేసుకున్నామన్నారు. దొంగలను చాకచక్యంగా పట్టుకున్న కంకిపాడు ఎస్సై డీ సందీప్‌తో పాటు సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ సమావేశంలో సీఐ మురళీకృష్ణ, ఎస్సైలు డీ సందీప్, ఉయ్యూరు రూరల్ ఎస్సై సురేష్ బాబు పాల్గొన్నారు.

వీర్నాల టోపీ శ్రీను హత్యకేసులో తొమ్మిది మంది నిందితులు అరెస్టు

● మీడియా సమావేశంలో డీఎస్పీ రాజా

మచిలీపట్నం టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో 21న రాత్రి జరిగిన వీర్నాల టోపీ శ్రీను హత్యకేసులో 9 మంది నిందితులను అరెస్టు చేసినట్టు డీఎస్పీ రాజా మీడియాకు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఇనకుదురుపేట పోలీసు స్టేషన్‌లో నిందితులను మీడియా ప్రతినిధులకు చూపించారు. అనంతరం మాట్లాడారు. 21న రాత్రి 8 గంటలకు వర్రె గూడెం వాటర్ ట్యాంకు వద్ద టోపీ శ్రీనును సుంకర ఉదయ వెంకటరమణ, మెరుగు రోహిత్ మరో ఏడుగురితో కలిసి శ్రీనివాసరావుతో గొడవపడ్డారు. ఉదయ వెంకటరమణ భార్య మాలిన్ భర్తతో విడిపోయి మృతుడు టోపీ శ్రీనివాసరావుతో సంబంధం పెట్టుకుంది. ఇది మనసులో పెట్టుకుని ఉదయ వెంకటరమణ 9 నెలల క్రితం టోపీ శ్రీనివాసరావును చింతచెట్టు సెంటర్‌లో కొట్టాడు. దీంతో శ్రీనివాసరావు ఇనకుదురు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో టోపీ శ్రీనివాస్‌ను సుంకర వెంకటరమణ చంపాలనే ఉద్దేశంతో మేనమామ కొడుకు మెరుగు రోహిత్, మెరుగు నాగదుర్గాప్రసాద్‌తో కలిసి క్రికెట్ బ్యాట్, ఇనుప రాడ్డు, కర్రలతో ఇష్టమొచ్చినట్టు కొట్టాడు. ఆ దెబ్బలు తగిలిన శ్రీనివాసరావు చనిపోగా మిగిలిన నిందితులు షేక్ సాజిద్ అలియాస్ సజ్జు, మహమ్మద్ సుజీ అబ్బాస్ అలియాస్ గౌసియా, మహమ్మద్ ఇలియాస్, వైశెట్టి శ్రీవాసు, షేక్ రహమాన్ అలియాస్ బుడ్డా, బడే పూర్ణచంద్రరావు అలియాస్ నాని టోపీ శ్రీనివాసరావును చంపండ్రా అంటూ కేకలేశారు. టోపీ శ్రీనివాసరావు స్నేహితుడు భద్రి ఇంటికొచ్చి ఇంటి వద్ద ఉన్న రామలక్ష్మికి చెప్పాడు. రామలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ కేసు నమోదు చేశారు. తరువాత సీఐ పరమేశ్వరరావు, ఎస్పీ గంగాధరరావు, డీఎస్పీ సీహెచ్ రాజు ఆధ్వర్యంలో చిలకలపూడి సీఐ నబీ, రాబర్ట్సన్ సీఐ ఏసుబాబు, గూడూరు, బంటుమిల్లి, మచిలీపట్నం, ఇనకుదురు ఎస్ఐలు దర్యాప్తు చేశారు. ఐదు టీమ్‌లుగా విడిపోయి నిందితులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సుంకర వెంకటరమణ, మెరుగు రోహిత్, మెరుగు నాగదుర్గాప్రసాద్, షేక్ సాజిద్, మమహ్మద్ సుజీ అబ్బాస్, ఇలియాస్, వైశెట్టి శ్రీవాసు, షేక్ రహమాన్, బడే పూర్ణచంద్రరావుపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచారు.

సీనియర్ సిటిజన్లకు డిజిటల్ కార్డు..!

● గ్రామ, వార్డు సచివాలయాల్లో అందుబాటులోకి రానున్న కొత్త సర్వీసు



బెంజిసర్కిల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేట్ సేవలు పొందేందుకు 60 ఏళ్లు నిండిన వృద్ధులకు గుర్తింపుగా ఉండే సీనియర్ సిటిజన్ కార్డును ఇకపై రాష్ట్రప్రభుత్వం డిజిటల్ రూపంలో అందించనుంది. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈ డిజిటల్ కార్డు అందించేలా కొత్త సర్వీస్ తీసుకువస్తున్నారు. ఇటీవల వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో జరిగిన సీనియర్ సిటిజన్ కౌన్సిల్, స్టేట్ అడ్వైజరీ బోర్డు ఆన్ డిజెబులిటీ సమావేశం దీనిపై నిర్ణయం తీసుకోవటంతో సీనియర్ సిటిజన్ కార్డుల జారీకి మార్గం సుగమమైంది. ఈ కార్డుతో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. అవేంటంటే..



ప్రయాణంలో రాయితీలు

ఇండియన్ రైల్వే సంస్థ రైలు ప్రయాణంలో 60 ఏళ్లు నిండిన పురుషులకు, 58 ఏళ్లు నిండిన మహిళలకు 40 శాతం టికెట్ రాయితీ, 80 ఏళ్లు నిండిన వారికి 50శాతం రాయితీ కల్పిస్తుంది. కొన్ని ప్రైవేట్ బస్ సర్వీస్‌లు, ఎయిర్ లైన్స్ టికెట్ ధరలు తగ్గిస్తున్నాయి.

వైద్య సదుపాయాలు

ఆస్పత్రుల్లో ప్రత్యేక క్యూలు, రాయితీలకు అవకాశం ఉంది. మందులు, డయాగ్నోస్టిక్ టెస్ట్‌లపై ధరలు తగ్గుతాయి.

బ్యాంకింగ్, ఫైనాన్షియల్ ప్రయోజనాలు

సీనియర్ సిటిజన్లకు ఎఫ్‌డీ, ఎస్‌సీఎస్ఎస్ సేవింగ్ స్కీమ్‌లపై అధిక వడ్డీ. ఇన్‌కం ట్యాక్స్ మినహాయింపు (80 ఏళ్ల పైపడినవారికి రూ.50వేల వరకు)

ప్రభుత్వ ప్రయోజనాలు, పెన్షన్లు

ఇందిరాగాంధీ నేషనల్ ఓల్డేజ్ పెన్షన్ స్కీమ్ వంటి పథకాలకు అర్హత. రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అదనపు సబ్సిడీలు

ఇతర సదుపాయాలు

మ్యూజియం, సినిమా హాళ్లు, పార్కుల్లో ప్రవేశ ఫీజులో రాయితీ, లైఫ్ ఇన్సూరెన్స్ ప్రీమియంలో తగ్గింపు

కార్డు లక్ష్యాలు

వృద్ధుల ఆర్థిక స్వాతంత్ర్యాన్ని పెంపొందించడం, ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యత, ప్రభుత్వ యోజనాలను సులభంగా అందుబాటులోకి తీసుకురావడం.

8 నుంచి ఐఆర్‌సీటీసీ సప్త జ్యోతిర్లింగ దర్శనయాత్ర

వన్‌టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రైల్వే క్యాటరింగ్, టూరిజం కార్పొరేషన్ లిమిటెడ్ సౌత్ సెంట్రల్ జోన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 8 నుంచి 19 వరకు 11 రాత్రులు, 12 రోజుల పాటు సప్త జ్యోతిర్లింగ దర్శన యాత్ర సాగుతుంది. ఏప్రిల్ 8న విజయవాడలో బయలుదేరుతుంది. మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్, నాగేశ్వర్, సోమనాథ్, భీమశంకర్, త్రయంబకేశ్వర్, ఘృష్ణేశ్వర్‌కు విజయవాడ, ఖమ్మం, ఖాజీపేట, సికింద్రాబాద్ మీదుగా రైలు వెళుతుంది. స్లీపర్ ఎకానమీలో పెద్దలకు రూ.20,890, స్టాండర్డ్ త్రీ ఏసీలో రూ.33,735, కంఫర్ట్ టూ ఏసీలో రూ.44,375 అవుతుంది. 5 నుంచి 11 ఏళ్ల పిల్లలకు ఎకానమీలో రూ.19,555, స్టాండర్డ్ త్రీ ఏసీలో రూ.32,160, కంఫర్ట్ టూ ఏసీలో రూ.42,485 చొప్పున చార్జీలు చెల్లించాలని ఐఆర్‌సీటీసీ విజయవాడ ఏరియా మేనేజర్ ఎం.రాజా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుకింగ్ కోసం 9281495848, 9281030714 నెంబర్లకు ఫోన్ చేయవచ్చునని, విజయవాడ రైల్వేస్టేషన్‌లోని రిటైరింగ్ రూమ్ వద్ద ఉన్న ఐఆర్‌సీటీసీ కార్యాలయంలో సంప్రదించవచ్చన్నారు. దీంతోపాటుగా ఆన్‌లైన్ బుకింగ్, మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చునన్నారు. బడ్జెట్ హోటళ్లలో రాత్రిపూట బస ఉంటుందని చెప్పారు. నాన్ ఏసీ వెహికల్, ఎకానమీ స్టాండర్డ్ ప్రయాణికులకు, ఏసీ వెహికల్ కంఫర్ట్ ప్రయాణికులకు అందుబాటులో ఉంటుందన్నారు. ఉదయం టీ, అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం శాఖాహారం మాత్రమే అందించబడుతుందన్నారు. ప్రయాణ బీమా, ఎస్కార్ట్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఐఆర్‌సీటీసీ టూర్ మేనేజర్లు ప్రయాణంలో మొత్త అందుబాటులో ఉంటారన్నారుఉ. దీనికి సంబంధించి పన్నులు వర్తిసాయని తెలిపారు.





ఆర్‌పీఎఫ్ మహిళా బెటాలియన్లకు నిర్మించిన బ్యారక్, ప్రారంభిస్తున్న ఆరోమా సింగ్ ఠాకూర్,

ఆర్‌పీఎఫ్ మహిళా బెటాలియన్లకు 30 పడకల బ్యారక్

రైల్వే స్టేషన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) మహిళా బెటాలియన్లకు రూ.1.5కోట్ల వ్యయంతో విజయవాడ రైల్వేకోర్టు సమీపంలో నిర్మించిన బ్యారక్‌ను బుధవారం ప్రారంభించారు. ఆర్‌పీఎఫ్ మహిళా బెటాలియన్లకు చక్కని వాతావరణంలో విశ్రాంతి తీసుకునేందుకు ఏర్పాటు చేసిన ఈ బ్యారక్‌ను సౌత్ సెంట్రల్ రైల్వే ఇన్స్‌పెక్టర్ జనరల్, ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ ప్రారంభించారు. సౌర విద్యుత్ సదుపాయం, ఎంటర్‌టైన్‌మెంట్ రూమ్, భోజనశాల, వంటగది, తదితర సౌకర్యాలతో ఈ బ్యారక్‌ను నిర్మించారు. ఇదే సమయంలో రైల్వే ఆడిటోరియంలో ఏపీ స్టేట్ ఆర్‌పీఎఫ్ మానవ అక్రమ రవాణా నిరోధక గవర్నమెంట్ రైల్వే పోలీసు విభాగాలకు అవగాహన నిమిత్తం, మానవ అక్రమ రవాణపై శిక్షణ తరగతిని నిర్వహించారు. సౌత్ సెంట్రల్ రైల్వే ఐజీ ఆరోమా సింగ్ ఠాకూర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అసోసియేషన్ ఆఫ్ వలంటరీ యాక్షన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విజయవాడ, గుంటూరు, గుంతకల్, వాల్తేర్ విభాగాలకు చెందినటువంటి ఆర్‌పీఎఫ్ సిబ్బంది సహా జీఆర్‌పీ సిబ్బంది మొత్తం 125 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరోమా సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీలో పనిచేస్తున్న మహిళా సిబ్బందికి సౌకర్యవంతమైన జీవనం అందించేందుకు కొత్త బ్యారక్ ఉపకరిస్తుందన్నారు. ఇదే సమయంలో మానవ అక్రమ రవాణ నిరోధకతపై ఇచ్చిన శిక్షణ తరగతి కూడా ప్రభావాన్ని చూపుతుందన్నారు. నేరాలను ఎదుర్కొనడంలో మెళకువల కోసం ఇటువంటివి అవసరమన్నారు. ఏడీఆర్ఎం కొండా శ్రీనివాసరావు, వాలేశ్వర బీ తోకల, ఎస్.వరుణబాబు, బీ నరేంద్ర వర్మ, టీ సురేష్, కే శ్రీధర్, జీ మధుసూదనరావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కార్డుదారులకు ఈ-కేవైసీ తిప్పలు

● అప్పటి విధానంతో ఇప్పుడు కష్టాలు
● ఉమ్మడి జిల్లాలో 3 లక్షల మందికి పైగా..
● సచివాలయంలో పాత సమాచారంతో గందరగోళం



మొగల్రాజపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణాజిల్లాలో కార్డుదారులకు ఈకేవైసీ కష్టాలు మామూలుగా లేవు. అధికారులు రేషన్ దుకాణదారులకిస్తున్న జాబితాలో ఎక్కువ మంది ఐదారేళ్ల పిల్లల పేర్లు, 80 ఏళ్లు దాటిన వృద్ధులి వారి పేర్లు వస్తున్నాయి. వీరందరి వేలిముద్రలు తీసుకుని ఈ కేవైసీ చేయాలని రేషన్ డీలర్లకు బాధ్యతలు అప్పగిస్తూ జాబితాలు అందజేశారు. ఆ జాబితాలోని కార్డుదారులు ఎవరెక్కడుంటారో తెలియడం లేదని డీలర్లు వాపోతున్నారు. ఇంకోపక్క ఈ కేవైసీ ఎవరికి చేయించాలో సమాచారం లేక కార్డుదారులు కూడా పెద్దగా దీనిపై స్పందించడం లేదు.

ఉమ్మడి జిల్లాలో

ఎన్టీఆర్ జిల్లాలో 5,90,293 కార్డులుండగా కార్డుల్లో సభ్యుల సంఖ్య 17లక్షల 02 వేల 907 మంది ఉన్నారు. కృష్ణాజిల్లాలో 522622 కార్డులుండగా మొత్తం సభ్యుల సంఖ్య 14 లక్షల 41 వేల 385 మంది ఉన్నారు. ఎన్టీయార్ జిల్లాలో లక్షా 65వేల 592 మందికి, కృష్ణాజిల్లాలో లక్షా 32వేల 701 మందికి ఈకేవైసి పెండింగ్‌లో ఉన్నట్లు చూపిస్తోంది. వీరంతా సంబంధిత రేషన్ దుకాణాలకు ఆధార్ కార్డులు తీసుకుని వెళ్లి ఈ కేవైసీ చేయించుకోవాలి. కాని వీరికి సమాచారం ఎలా చేరుతుందనేది సమస్య.

మ్యాపింగ్‌తోనే అసలు సమస్య

ఉమ్మడి కృష్ణాజిల్లాలో 3 లక్షల మందికిపైగా ఈ కేవైసీ చేయాలి. వైసీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ తీసుకుని రావడంతో పౌరసరఫరాల కార్యాలయాలకు పనిలేకుండా పోయింది. సచివాలయ వ్యవస్థ వచ్చిన తరువాత కార్డులను ఆయా సచివాలయాలకు మ్యాపింగ్ చేశారు. ఈ మ్యాపింగ్ ఇపుడు తిప్పలు తెచ్చింది. సచివాలయ వ్యవస్థ పుట్టిన మొదట్లో మ్యాపింగ్ చేశారు. తరువాత పట్టించుకోలేదు. 50 శాతానికి పైగా కార్డుదారులు ఆయా సచివాలయాల పరిధి నుంచి మరో సచివాలయ పరిధలోకి లేదంటే మరో మండలానికో, జిల్లాలో వెళ్లిపోయారు. సచివాలయంలోని వివరాల్లో ఇలా వలస వెళ్లిపోయిన వారి వివరాలు లేవు. వీరి కార్డులు మాత్రం సచివాలయ జాబితాలో ఉంటున్నాయి. దీని ప్రకారం ఈ కేవైసీ చేయాల్సిన పేర్ల వివరాలను సచివాలయం వారీగా రేషన్ డీలర్లకు ఇస్తున్నారు. ఆ జాబిలలో చిరునామాలు, ఫోన్ నెంబర్లు లేవు. దీంతో ఎం చేయాలో తెలియక డీలర్లు తలలు పట్టుకుంటున్నారు. మరోపక్క ఈ కేవైసీ ఈ నెల 31లోగా పూర్తి చేయాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారు.

టీడీపీ హయాంలో..

గతంలో టీడీపీ హయాంలో రేషన్ కార్డుదారుల సమాచారమంతా పౌరసరఫరాల కార్యాలయంలో ఉండేది. ప్రతి నెల రేషన్ డీలర్లకు కీ రిజిస్టర్‌లు ఇచ్చేవారు. కార్డుదారుల వివరాలను, ఫోన్ నెంబర్‌లను, రేషన్ డీలర్‌లు నమోదు చేసుకునేవారు. దీంతో కార్డుదారులు బియ్యానికి రాకపోతే ఫోన్ చేసి పిలిపించుకుని ఇచ్చేవారు. వైసీపీ వచ్చిన తరువాత డోర్ డెలివరీ విధానం రావడంతో కార్డుదారులు రేషన్ డిపోలకు రావడం లేదు. దీంతో కార్డుదారుల సమాచారం అందుబాటులో లేదు. మరి ఈ ఈకైవైసీ ఎప్పటికి పూర్తవుతుందో అంతుబట్టని స్థితిలో ఉంది.

రేపు వంశీ బెయిల్‌పై తీర్పు

విజయవాడ కోర్టులో ముగిసిన వాదనలు

విజయవాడ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): విజయవాడ జిల్లా జైలులో ఉన్న గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ బెయిల్ పిటిషన్‌పై వాదనలు పూర్తయ్యాయి. శుక్రవారం న్యాయాధికారి తీర్పు ఇవ్వనున్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ న్యాయస్థానంలో ప్రాసిక్యూషన్ తరఫున జేడీ రాజేంద్రప్రసాద్ బుధవారం వాదనలు వినిపించారు. వంశీ తరఫున డాక్టర్ వి.దేశీసత్యశ్రీ వాదించారు. ఇద్దరి వాదనలను విన్న అనంతరం న్యాయాధికారి హిమబిందు తీర్పును ఈ నెల 28కు రిజర్వు చేశారు. ముదునూరి సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసిన కేసులో వంశీతో పాటు అరెస్టయిన వెలినేని శివరామకృష్ణప్రసాద్, నిమ్మ చలపతి, గంటా వీర్రాజు, వేల్పుల వంశీ బెయిల్‌పై తీర్పును ఏప్రిల్ ఒకటో తేదీకి వాయిదా వేశారు.

కస్టడీ పిటీషన్‌పై రేపటికి వాయిదా

గన్నవరం: వైసీపీ మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ కస్టడీ పిటీషన్‌పై బుధవారం వాదనలు జరిగాయి. వంశీ తరఫున న్యాయవాది సత్యశ్రీ, ప్రాసిక్యూషన్ తరఫున జాయింట్ డైరెక్టర్ ప్రాసిక్యూషన్స్ కల్యాణి వాదనలు వినిపించారు. ఫోర్జరీ సంతకాలు చేసి, బెదిరించి, కుట్రపూరితంగా నకిలీ పత్రాలు సృష్టించి ఒకరి భూమిని మరొకరి చేతుల్లో పెట్టి తనకు చెందాల్సిన ఆస్తిని దక్కకుండా అన్యాయం చేశారన్న కేసుపై మరింత సమాచారం కోసం 5 రోజులు కస్టడీకి ఇవ్వాలని కల్యాణి వాదనలు వినిపించగా, ఇది ఎప్పుడో జరిగిందని, ఐదేళ్లవుతుందని కస్టడీకి ఇవ్వాల్సిన అవసరం లేదని సత్య శ్రీ వాదించారు. ఇరు వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును శుక్రవారానికి వాయిదా వేశారు.

మచిలీపట్నం

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	120, 129, 140
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 415

కోదండ రామస్వామి ఆలయ చైర్మన్‌గా పెదశింగు సామేరు

మచిలీపట్నం టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : కరగ్రహారంలోని కోదండ రామస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడిగా పెదశింగు సామేరును బుధవారం నియమించారు. కరగ్రహారంలోని సోమేశ్వర స్వామి దేవస్థానానికి జనసేన నాయకుడు తోట భాస్కరరావును నియమించారు. మాజీ సర్పంచ్, గ్రామ టీడీపీ అధ్యక్షుడు నాగుల్‌మీరా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు బత్తిన నాగరాజు, బొర్రా రాము, కె.అంజి, షేక్ జమాల్, మట్టా నాగరాజు, మహాలక్ష్ముడు, కట్టా రవి, పామర్తి వెంకటేశ్వరరావు, మోతుకూరి వాసు, తోట సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆక్సిజన్ పరికరాల అందజేత

కృత్తివెన్ను, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రోగులకు నాణ్యమైన వైద్య సదుపాయాలను ప్రభుత్వం అందిస్తుందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. శీతనపల్లి, లక్ష్మీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు 90 వేల రూపాయిల విలువ చేసే ఆక్సిజన్ కాన్స్ స్టేటర్‌లను వైద్యులు సూర్యతేజ్, సందీప్‌లకు బుధవారం అందించారు. పేద ప్రజలకు ఉన్నతమైన వైద్య సేవలను అందించటానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ఆహ్వానం

నాగాయలంక, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వం, ఆయుష్ మంత్రిత్వ శాఖ అంతర్జాతీయ స్థాయిలో యోగా అభివృద్ధి, ప్రచారానికి అత్యుత్తమ కృషి చేసినందుకు 2025వ సంవత్సరానికి ప్రధానమంత్రి యోగా అవార్డుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.ఝాన్సీలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవార్డులు నిష్కళంకమైన ట్రాక్ రికార్డు, యోగా ప్రమోషన్, అభివృద్ధికి అత్యుత్తమ సహకారం అందించిన వ్యక్తులు, సంస్థలకు ఇవ్వబడతాయని తెలిపారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ// ఇన్‌వైట్‌ఇండియా.మైజివోవి.ఇన్/యోగా -అవార్డ్స్-2025 ఆన్‌లైన్‌పోర్టల్‌లో స్వయంగా దరఖాస్తులను మార్చి 31లోగా ఆన్‌లైన్‌లో పంపించాలని కోరారు.

గ్రామీణ ప్రాంత అభివృద్ధే కూటమి లక్ష్యం

కోడూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు మర్రె గంగయ్య అన్నారు. బుధవారం కోడూరు పంచాయతీ పరిధిలో ఎస్టీ కాలనీ వద్ద నుంచి శ్మశాన వాటికవరకు రూ.24 లక్షలు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు, మట్టి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో కోట రాంబాబు, కడవకొల్లు శ్రీనివాసరావు, పూతబోయిన సీతారత్న సాయిబాబు, కాగిత రామారావు, ముద్దినేని పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

చల్లపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ సందర్భంగా టీడీపీ నేత రావి రాజేశ్వరరావు నారాయణరావు నగర్ మసీదులోని ముస్లింలకు బుధవారం ఇఫ్తార్ సమయంలో అల్పాహారం అందజేశారు. సాయంత్రం నమాజు అనంతరం ముస్లింలను కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలియచేసి ఖర్జూరాలు, పండ్లు, స్వీట్లు అందించారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి రావి చిట్టి, వార్డు సభ్యుడు షేక్ సిలార్, మసీదు కమిటటీ పెద్దలు, పాల్గొన్నారు.

ఉపసర్పంచ్ ఎన్నిక నేడు

మోపిదేవి: నాగాయితిప్ప పంచాయతీ ఉపసర్పంచ్ ఎన్నిక గురువారం నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి, ఈవోపీఆర్డీ కె.టి.సుందరి తెలిపారు. ఉదయం 10.30 గంటలకు పంచాయతీ పాలకవర్గం సమావేశం ఏర్పాటు చేసి 11 గంటల నుంచి ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం

• ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

పెడన రూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, వాటిని పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. జింజేరు, అచ్చయ్యవారిపాలెం గ్రామాల్లో బుధవారం ప్రజా గ్రీవెన్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వహయాంలో ప్రజా సమస్యలను గాలికి వదిలేశారన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలున్నా అవి పరిష్కరించేందుకు ఎటువంటి చర్యలు చేపట్టలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతంగా చేస్తుందన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ పేరుతో అనేక సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులు తాగునీరు, రోడ్లు, పింఛన్ల కోసం అర్జీలు ఇచ్చారు. జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేష్, శలపాటి ప్రసాద్, గ్రామస్థులు పాల్గొన్నారు.

గూడూరు: పోలవరంలో కలంకారీ క్లస్టర్ డెవలప్‌మెంట్‌లో భాగంగా హెచ్‌సీఎల్ ఫౌండేషన్, వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో కలంకారీ సేఫ్టీ షూకిట్, ఎప్రాన్, హ్యాండ్‌బ్లాక్ టేబుల్, లాంగ్ టేబుల్, ఫ్యాబ్రిక్ అందజేశారు. కప్పలదొడ్డి, ఆకులమన్నాడు, పోలవరం గ్రామ పంచాయతీలకు చెత్త సేకరణ రిక్షాలను ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అందించారు. హెచ్‌సీఎల్ ప్రతినిధులు శ్రీనివాసులు, మార్షల్, జాషువ, వాసవ్య మహిళా మండలి ప్రతినిధులు రామాంజనేయులు, విజయ, ఇండస్ట్రియల్ జనరల్ మేనేజర్ వెంకటరావు, హ్యాండ్లూమ్ డీవో రాజు, తహసీల్దార్ డి. రాజ్యలక్ష్మి,పాల్గొన్నారు.



చెత్త సేకరణ రిక్షాను అందచేస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

కరాటేలో సెయింట్ ఆన్స్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

అవనిగడ్డ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ డోజ కరాటే టోర్నమెంట్‌లో అవనిగడ్డకు చెందిన సెయింట్ ఆన్స్ విద్యార్థులు పతకాలు సాధించారు. విజయవాడ క్లాత్ మర్చంట్ అసోసియేషన్ స్కూల్ నిర్వహిం చిన ఇంటర్ డోజో కరాటే టోర్నీలో సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ పొందారు.



మెడల్స్ పొందిన విద్యార్థులు

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం

పెడన రూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో శాంతి భద్రతలతో ప్రజాజీవనం కొనసాగాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై ఎం.రామశేషయ్య అన్నారు. నవోదయం 2.0లో భాగంగా నందమూరు శివారు కోటవానిపాలెంలో ప్రజలతో ముఖాముఖి నిర్వహించారు. ప్రజలు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామంలో నాటుసారా తయారీ చేయకుడదన్నారు. చట్టవ్యతిరేక విధానాలు చేపడితే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు.

పురపాలక సంఘానికి రూ.25 లక్షల ఆదాయం

● మునిసిపల్ కమిషనర్ గోపాలరావు

పెడన, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ మార్కెట్ల వేలం ద్వారా పెడన మునిసిపాలిటీకి రూ.25 లక్షల 9వేల ఆదాయం వచ్చిందని కమిషనర్ గోపాలరావు తెలిపారు. పట్టణంలోని మునిసిపల్ మార్కెట్లలో రోజువారీ రుసుము వసూలు చేసుకునే హక్కుకు బుధవారం పురపాలక సంఘ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించారు. పాటదారులు రౌతుల ప్రసాద్, అబ్దుల్ హై, వాజీదున్నీసా పాల్గొన్నారు. వాజీదున్నీసా రూ. 25 లక్షల 9వేలకు హెచ్చుపాట పాడి 2025 ఏప్రిల్ 1నుంచి 2026 మార్చి 31వ తేదీ వరకు మునిసిపల్ మార్కెట్లలో రోజు వారీ రుసుము వసూలు చేసుకునే హక్కును సొంతం చేసుకున్నారు. బహిరంగ వేలంలో మునిసిపల్ మేనేజర్ మట్టా రాజా, సీనియర్ అసిస్టెంట్ కృష్ణయ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పామర్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



బహిరంగ వేలం నిర్వహిస్తున్న మునిసిపల్ అధికారులు

50 శాతం వడ్డీ మాఫీ

ఆస్తి, ఖాళీస్థలాల పన్నుల బకాయిదారులకు ఈనెల 31వ తేదీలోపు ఒకేసారి మొత్తం బకాయిలు చెల్లిస్తే 50 శాతం వడ్డీని మాఫీ చేస్తామని కమిషనర్ గోపాలరావు తెలిపారు. పన్ను బకాయిదారులు దీనిని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ముగిసిన శిక్షణా కార్యక్రమం

ఘంటసాల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో గ్రామీణ యువతకు 'అలంకరణ చేపల పెంపకం - యాజమాన్య పద్ధతుల'పై శిక్షణా తరగతులు బుధవారంతో ముగిశాయి. హైదరాబాద్‌కు చెందిన జాతీయ మత్స్య అభివృద్ధి మండలి సహకారంతో నిర్వహించిన ఈ శిక్షణలో అలంకరణ చేపలకు వచ్చే వ్యాధులు, వైరల్, బ్యాక్టీరియల్, ఫంగల్, పరాన్న జీవుల వ్యాధులు, చేప పేను, పోషకాహార లోపం వల్ల కలిగే వ్యాధుల గురించి వివరించారు. అలంకరణ చేపల బిజినెస్‌లో మార్కెట్ ఎలా చేయాలనే విధానంపై కూడా శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువీకరణ పత్రాలు అందించారు. కార్యక్రమంలో కేవీకే సమన్వయ కర్త డాక్టర్ డి.సుధారాణి, శాస్త్రవేత్త డాక్టర్ బి.నవీన్, యశ్వంత్ కుమార్, మంజువాణి,వెంకటలక్ష్మి పాల్గొన్నారు.



శిక్షణపూర్తి చేసినవారికి సర్టిఫికెట్లు అందజేసిన శాస్త్రవేత్తలు

విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ

చిరుధాన్యాలు, తృణధాన్యాలు, పప్పు ధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై మూడు రోజులపాటు జరిగే శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ పి.సుధారాణి, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో పార్టీని విస్తరిస్తాం : సీపీఎం

మోపిదేవి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సీపీఎంను మండలంలోని అన్ని గ్రామాల్లో విస్తరించేలా కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన మండల కమిటీ కార్యదర్శి సి.హెచ్.రాజశేఖర్ అన్నారు. సీపీఎం మండల కమిటీ సమావేశం బుధవారం మోపిదేవిలో జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, కార్యవర్గ సభ్యులు శీలం నారాయణరావు పర్యవేక్షణలో జరిగింది. ఈ సందర్భంగా మోపిదేవి మండల నూతన కమిటీని నియమించారు. మండల కమిటీ కార్యదర్శిగా చిరివేళ్ల రాజశేఖర్, కార్యవర్గ సభ్యులుగా మరీదు సురేష్, బెజవాడ నాగేశ్వరరావు, కర్రా వెంకటేశ్వరరావు, సహదేవుడు, బండి నిర్మల, కొమ్ము జయరావులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు.

నైపుణ్యంతోనే భవిష్యత్తు

●కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి కె.రాంజీ

మచిలీపట్నం టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : యువత ఎప్పటికప్పుడు తమ నైపుణ్యాన్ని మెరుగుపరుచుకుని, భవిష్యత్తులో రాణించాలని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి కె.రాంజీ అన్నారు. కేయూ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న సీఆర్‌టీ శిక్షణా తరగతుల బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వీసీ రాంజీ మాట్లాడుతూ విద్యార్థులు, యువత చదవడం, వినడం ద్వారా చాలా విషయాలు తెలుసుకోవచ్చన్నారు. ఆ అలవాటును దినచర్యగా మార్చుకోవాలన్నారు. త్వరలో విశ్వవిద్యాలయంలో ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తామన్నారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎన్.ఉష, డీన్ వై.కె.సుందరకృష్ణ, దిలీప్, డాక్టర్ దిట్టకవి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



సమావేశంలోమాట్లాడుతున్న ఉపకులపతి కె. రాంజీ



స్వచ్ఛసేవలో పాల్గొన్న కేరళ బైబిల్ కళాశాల యువకులు

స్వచ్ఛ సేవలో కేరళ బైబిల్ కళాశాల యువకులు

చల్లపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : స్ఫూర్తివంతంగా సాగుతున్న స్వచ్ఛ చల్లపల్లి సేవా కార్యక్రమంలో కేరళ బైబిల్ కళాశాల యువకులు పాల్గొని సేవలందించారు. కేరళ బైబిల్ కళాశాలలో శిక్షణ పొందుతున్న మిజోరం రాష్ట్రం యువకుడు చోచో, తమిళనాడు యువకులు శివబాలన్, అస్సెల్లా, కాకినాడ యువకుడు శామ్యూల్ ప్రాక్టికల్ మినిస్ట్రీ నిమిత్తం చల్లపల్లికి చెందిన దైవసేకుడు గోల్కొండ డేవిడ్ వద్దకు వచ్చారు. సామాజిక సేవల్లో భాగస్వాములయ్యేందుకు డేవిడ్‌తోపాటు బైబిల్ కళాశాల యువకులంతా బుధవారం తెల్లవారుజామున జరిగిన 3424వ రోజు స్వచ్ఛ సేవలో పాల్గొన్నారు. పాగోలు రోడ్డులోని ఎన్టీఆర్ పాఠశాల ప్రాంతంలో స్వచ్ఛ కార్యకర్తలతో కలిసి సేవలందించారు.

రహదారి విషయమై ఘర్షణ

● కత్తితో దాడి .. ఇద్దరికి గాయాలు



వివరాలు సేకరిస్తున్న ఎస్సై సత్యనారాయణ

మోపిదేవి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రహదారి పక్కనే అపరిశుభ్రంగా వేసిన కొబ్బరి డొప్పల విషయమై ఇరువురి మధ్య జరిగిన దాడిలో ఒకరు కత్తితో దాడి చయగా ఇద్దరు గాయపడ్డారు. మోపిదేవి శివారు దళితవాడలో ఉన్న సిమెంట్ రహదారి పక్కనే కొబ్బరికాయల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్న అరజా సుబ్రహ్మణ్యం కొబ్బరి డొబ్బలు వేస్తున్నాడు. ఆ పక్కనే నివశిస్తున్న గుంటూరు శ్రీనివాసరావు నివాసాల మధ్య అపరిశుభ్రంగా ఇక్కడ వేయవద్దు మరొక చోట వేయమనడంతో ఇద్దరి మధ్య మాట మాట పెరిగి ఘర్షణకు దారితీసింది. సుబ్రహ్మణ్యం, అతని కుమారుడు కలసి గుంటూరు శ్రీను అతని కుమారులైన అశోక్, బాలమురళీలపై కత్తితో దాడి చేశారు. అశోక్ మెడ వద్ద, బాలమురళీ చేతికి గాయాలు కాగా, 108 అంబులెన్స్‌లో అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మోపిదేవి ఎస్సై సత్యనారాయణ ఘటనా స్థలాన్ని పరిశీలించి, స్థానికుల నుంచి వివరాలు సేకరించారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి కృషి : సర్పంచ్

చల్లపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డడ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సహకారంతో గ్రామంలో నూరుశాతం సీసీ రోడ్ల నిర్మాణానికి కృషిచేస్తున్నట్లు సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి తెలిపారు. చల్లపల్లిలో ఉపాధి హామీ పథకం నిధులు రూ.నాలుగు లక్షలతో నూతన సీసీ రోడ్డు నిర్మాణపు పనులను బుధవారం సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కృష్ణకుమారి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రత్యేక చొరవతో చేపట్టిన పల్లెపండుగ కార్యక్రమం గ్రామీణ ప్రాంతాల రూపురేఖలు మార్చుతోందన్నారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ పెద్దఎత్తున నిధులు కేటాయించి అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈవో పి.వి.మాధవేంద్రరావు, వార్డుసభ్యుడు మీర్ రిజ్వాన్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వంశీకృష్ణ, కోట సత్యనారాయణ, జ్యోతికుమారి తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన సర్పంచ్ కృష్ణకుమారి

మద్యం దుకాణంలో చోరీ

పెడన, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : తోటమూలలోని పీఆర్ వైన్స్ షాపులో చోరీకి పాల్పడిన యువకులను పోలీసులు పట్టుకుని మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం రాత్రి పీఆర్ వైన్‌షాపు వద్దకు గుడివాడ డిపో నుంచి మద్యం సీసాలు వచ్చాయి. పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన అమృత వెంకటేశ్వరరావు (29), తోటమూలకు చెందిన తూమాటి శివ (25) కూలీకి వాహనంపై నుంచి దించి వైన్‌షాపులోకి వాటిని చేర్చారు. షాపు యజమాని కొండేటి పేరయ్య అనంతరం షాపునకు తాళం వేసి వెళ్లిపోయాడు. అదే రోజు రాత్రి వెంకటేశ్వరరావు, శివ వైన్‌షాపు వెనుక వైపున ఉన్న తులుపులు లేని ఐరన్ కిటికీ చువ్వలు వంచి లోపలికి చొరబడ్డారు. రూ. 30వేల విలువ గల మద్యం సీసాలు అపహరించుకుపోయారు. షాపు యజమాని ఫిర్యాదు మేరకు ఎస్సై జి.సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బౌద్ధక్షేత్రాన్ని సందర్శించిన జపనీయులు

ఘంటసాల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఘంటసాలలోని బౌద్ధ క్షేత్రాన్ని బుధవారం జపాన్ దేశానికి చెందిన వారు సందర్శించారు. బౌద్ధస్థూపం చుట్టూ ప్రదక్షిణలు మ్యూజియంలోని బుద్ధుని శిల్ప సంపదను ఆసక్తిగా తిలకించారు. బౌద్ధ శిల్ప సంపద విశేషాలను గైడ్ కరుణానిధి వారికి వివరించారు. బౌద్ధ క్షేత్రాల సందర్శనలో భాగంగా ఘంటసాలకు విచ్చేసినట్లు గైడ్ కరుణానిధి తెలిపారు. కార్యక్రమంలో జపాన్ దేశస్థులు కటయమా తత్తను, సానో కాజుహారు, మంచిదా షొంచి, టోనే మోటాకో తోపాటు జడ్పీ మాజీ ఉపాధ్యక్షులు గొర్రెపాటి వెంకట రామకృష్ణ పాల్గొన్నారు.



బౌద్ధ స్థూపాన్ని సందర్శించిన జపాన్ దేశస్థులు

డస్ట్‌బిన్ల పంపిణీ

మచిలీపట్నం టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్రలో భాగంగా కానూరు పంచాయతీ పరిధిలోని వన్నూరు, కానూరు, చిన్నకానూరు, కొత్తిల్లు, గణపాబత్తుల కానూరు గ్రామాల్లో బుధవారం తడి, పొడిచెత్తలు వేరే చేసేందుకు కూటమి ప్రభుత్వం అందించిన డస్ట్‌బిన్‌లను కృష్ణాజిల్లా తెలుగురైతు అధ్యక్షుడు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ, ప్లాస్టిక్ కవర్ల వాడకం నిషేధించాలని, చెత్తను డస్ట్‌బిన్‌లలో వేయాలన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్‌చార్జి దివి మహేష్, పంచాయతీ సెక్రటరీ వెంకటేశ్వరరావు, గోపు వెంకటరమణ, బొలిశెట్టి నాని, వీర చిన్న తదితరులు పాల్గొన్నారు.

భూ రీసర్వేలో రైతులు పాల్గొనాలి

కోడూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పిట్టలంక గ్రామంలో ఈ నెల 29న జరిగే భూ రీసర్వేలో రైతులు పాల్గొనాలని తహసీల్దార్ శ్రీను నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పిట్టల్లంక గ్రామంలో వ్యవసాయ భూమి కలిగిన భూ యజమానులు దస్తావేజులు, పట్టాదారు పుస్తకాల, బ్యాంక్ ఖాతా, ఆధార్ కార్డు జిరాక్స్‌తోపాటు ఫోన్ నెంబరు, రెండు ఫొటోలు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. ఈ అవకాశాన్ని భూ యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

గూడూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మల్లవోలు శివారు పచార్లంక రోడ్డులో మంగళవారం రాత్రి పేకాట శిబిరంపై ఎస్సై సత్యనారాయణ సిబ్బంది దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్టు చేసి రూ. లక్షా 6 వేల 500 సీజ్ చేశారు. పేకాట, క్రికెట్ బెట్టింగ్, ఇతర చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

నవోదయకు నలుగురు విద్యార్థుల ఎంపిక

మోపిదేవి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన పరీక్షల్లో మోపిదేవికి చెందిన చిల్డ్రన్స్ పాఠశాల నుంచి నలుగురు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎం.సుధాకర్ తెలిపారు. పాఠశాలలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 14 మంది విద్యార్థులు హాజరుకాగా వారిలో కేసాని నాగ శైలేష్, పోతురాజు ధార్మిక సాయి, కొప్పుల నాగ అఖిల్, నల్లూరి సాయి భార్గవ్ అత్యధిక మార్కులు సాధించారన్నారు. ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	120, 129, 140
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 415

పరిశోధనా పద్ధతులు, మేధో సంపత్తిపై అవగాహన

గుడివాడ, మార్చి 26(ఆంధ్రజ్యోతి) : శాస్త్రీయ పరిశోధనకు సాహిత్య సమీక్ష సముచితమైన రీతిలో ఉండాలని ఢిల్లీ బిజినెస్ స్కూల్ ప్రొఫెసర్ కె.త్రివేణికుమారి అన్నారు. స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో పరిశోధనా పద్ధతి, మేధో సంపత్తి హక్కులపై అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిశోధన శాస్త్రీయంగా ఎలా చేయాలో, దానిలో ఉన్న అంశాలను ఉదాహరణలతో విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్ఆర్‌కే ప్రసాద్, కె.ఎస్ అప్పారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్ పద్మజ, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ సువర్చల, అధ్యాపకులు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.



త్రివేణికుమారిని సత్కరిస్తున్న కళాశాల సిబ్బంది

పాల ఉత్పత్తిదారులకు బోనస్

కూచిపూడి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కూచిపూడిలోని పాల ఉత్పత్తిదారుల సహకార సంఘ పరిధిలోని పాల రైతులకు 2023 -24 సంవత్సరానికి సంబంధించి రూ.33,648ల బోనస్‌ను రైతులకు అందజేశారు. పాల సొసైటీ అధ్యక్షురాలు పైడిపాముల మనోహరం, సూపర్‌వైజర్ రమేష్, కార్యదర్శి సత్యశ్రీనివాస్, లంకపల్లి సుబ్రహ్మణ్యం, పాల రైతులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తలను వేర్వేరుగా అందించాలి

పెదపారుపూడి : తడి, పొడి చెత్తలను వేర్వేరుగా గ్రామపంచాయతీ పారిశుధ్య సిబ్బందికి అందించి సహకరించాలని పెదపారుపూడి ఈవోపీఆర్‌డీ వంగా శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఈదులమద్దాలి గ్రామంలో ఆయన ఇంటింటికి తిరిగి చెత్త విభజనపై ప్రజల్లో అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు చెత్త విభజనపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జి.అహల్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాల్గొన్నారు.

బెల్టు షాపుపై దాడి

గుడివాడ : పామర్రు మండలంలోని జుజ్జువరానికి చెందిన వీరంకి నాంచారయ్య నిర్వహిస్తున్న బెల్టు షాపుపై ఎక్సైజ్ అధికారులు బుధవారం దాడులు చేశారు. అతని వద్ద నుండి 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు గుడివాడ ఎక్సైజ్ సీఐ వెంకటరమణ తెలిపారు. ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

పామర్రు: పామర్రు-గుడివాడ ప్రధాన రహదారిపై కొత్తపెదమద్దాలి వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో ఓ వృద్ధురాలు మృతిచెందింది. కొత్తపెదమద్దాలికి చెందిన కానోళ్ల శేషమ్మ(82) తన ఇంటి సమీపంలో గల గుడినుంచి ఇంటికి వెళుతుండగా ,గుడివాడ నుంచి పామర్రు వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో శేషమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. ద్విచక్రవాహనదారుడికి సైతం కాలుకు బలమైన గాయమైంది. ఇరువురిని 108 ద్వారా చికిత్సనిమిత్తం బందరు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శేషమ్మ మృతిచెందినది. ఎస్సై రాజేంద్రప్రసాద్ కేసు నమోదు చేసి , దర్యాప్తు చేస్తున్నారు.

పేదలకు భోజన ప్యాకెట్ల పంపిణీ

గుడివాడ, : స్థానిక బేతవోలులోని వృద్ధులకు, ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఉన్న కొర్నిపాడులోని పేదలకు పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా అంతర్జాతీయ అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీశాఖ హ్యూమానిటీ ఫెస్ట్ ఆధ్వర్యంలో బుధవారం భోజన ప్యాకెట్లను అందజేశారు.

మౌలిక వసతుల కల్పనే ధ్యేయం

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, మార్చి 26(ఆంధ్రజ్యోతి) : గుడివాడలో పేదవర్గాల నివాసిత ప్రాంతాల్లో వసతుల కల్పన ప్రతిపాదనలతో రూ.86కోట్ల వ్యయంతో డీపీఆర్ (డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టు)సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపినట్టు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని ఎమ్మెల్యే వెనిగండ్ల స్వగృహంలో పబ్లిక్ హెల్త్, మున్సిపల్ అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రాజెక్టుల ప్రతిపాదనల వివరాలను ఎమ్మెల్యే వెనిగండ్లకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాల్టీలో రూ.22.50కోట్లతో తాగునీటి సరఫరా, నిర్వహణ, పైపులైన్లు, నూతన ట్యాంకుల నిర్మాణ ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. రూ.10.90కోట్లతో డివిజన్‌లో కనీస మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు రూపొందించామన్నారు. రూ.52.74కోట్లతో పట్టణంలోని పెద్దవీధి, కొత్తపేట, ముబారక్ సెంటర్, బైపాస్ రోడ్డు, గుడ్‌మెన్‌పేట తదితర 13కీలోమీటర్ల పరిధిలోని ప్రాంతాల్లో డ్రెయినేజీ వ్యవస్థ అభివృద్ధి పనులను చేపట్టనున్నట్టు ఆయన వివరించారు. దీంతోపాటుగా సీనరైజ్ మురుగునీటి శుద్ధి(ఎం.ఎల్.డి) ట్యాంకు నిర్మాణానికి పైలెట్ ప్రాజెక్టుగా రూపొందించిన ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపామన్నారు. పట్టణ శాటిలైట్ మ్యాప్ నమూనా ద్వారా అధికారులు ఎమ్మెల్యే వెనిగండ్లకు వివరించారు. గుడివాడ రూపురేఖలను మార్చేందుకు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నామన్నారు. అధికారులు రూపొందించిన అంచనాల ప్రకారం నిధులు సాధించేందుకు మున్సిపల్ మంత్రి నారాయణ. సంబంధిత శాఖల ఉన్నతాధికారులను కలుస్తానన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో ఎంపీ వల్లభనేని బాలశౌరితో కలిసి అమృత్ 2.0 నుంచి నిధులు మంజూరయ్యేలా తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ సమావేశంలో పబ్లిక్ హెల్త్ ఈఈ స్వామినాయుడు, డీఈ పాండురంగారావు, మున్సిపల్ ఇంజినీరు ఎ.ఎస్.ఎన్ ప్రసాద్, కన్సల్టెన్సీ డైరెక్టర్ శాస్త్రి, టీడీపీ నాయకులు పెద్ది శ్రీకాంత్,పబ్లిక్ హెల్త్, మున్సిపల్, కన్సల్టెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

అసంఘటిత కార్మికులకు పీఎం జీవన్‌జ్యోతి పథకం అండ

గుడివాడ, మార్చి 26(ఆంధ్రజ్యోతి) : అసంఘటిత రంగ కార్మికులకు ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి పథకం కొండంత అండ అని పండ్ల వర్తక సంఘ అధ్యక్షులు గోకరకొండ బలరాం అన్నారు. బుధవారం స్థానిక పోస్టల్ శాఖ ప్రధాన కార్యాలయంలో ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందిన పండ్ల వర్తక సంఘ సభ్యుడు బుజ్జి కుటుంబసభ్యులకు జీవన్‌జ్యోతి బీమా యోజనపథకం చెక్కును పోస్టల్ శాఖ అధికారులతో కలిసి ఆయన అందజేశారు. ఐపీవో బి.విజయ్, ఐపీపీబి మేనేజర్ గణేష్, గుడివాడ పండ్ల వర్తక సంఘ నాయకులు పెద్ది కిషోర్, అప్పన్న పాల్గొన్నారు.

విద్యుత్ ట్రూ అప్ చార్జీలు తగ్గించాలి : సీపీఎం

కూచిపూడి : విద్యుత్ ట్రూ అప్ చార్జీల పేరిట ప్రజలపై మోపుతున్న భారాన్ని తగ్గించాలని సీపీఎం మొవ్వ మండల కార్యదర్శి శీలం నారాయణరావు డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్రూ అప్ ఛార్జీల భారాన్ని ప్రభుత్వమే భరించాలని, స్మార్ట్ మీటర్లు బిగించవద్దంటూ ఆయన కోరారు. విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించాలని కోరుతూ సీపీఎం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు ఈ నెల 28వ తేదీన మండల కేంద్రమైన మొవ్వలో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్టు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో చిగురుపల్లి సుబ్రహ్మణ్యం, కల్యాణరాముడు, సుబ్బారావు పాల్గొన్నారు.

సబ్సిడీ పనిముట్ల కొనుగోలుకు దరఖాస్తుల ఆహ్వానం

గుడివాడ రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో యంత్ర పరికరాల విడి పనిముట్లు కొనుగోలు చేయటానికి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని మండల వ్యవసాయాధికారిణి బోలెం అనంతలక్ష్మి అన్నారు. బుధవారం మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో మండలంలోని వీఏఏలకు వివిధ అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఆర్ఎస్ కేంద్రాలలో నమోదు చేయించాలని కోరారు. ప్రతి ఆర్ఎస్‌కేంద్రంలో నిర్దేశించిన లక్ష్యాల మేరకు చేయాలన్నారు. ప్రభుత్వం రైతుల కోసం విడి పనిముట్లను ఇవ్వటానికి సిద్ధంగా ఉందని, రైతులకు అందించటానికి వీఏఏలు కృషి చేయాలని కోరారు. మినుము పండిన పంటను ఆర్ఎస్‌కేలలో నమోదు చేయించుకోవాలన్నారు. మార్కెట్ యార్డులో మినుము కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తున్నందున క్వింటాల్‌కు రూ.7400ల చొప్పున కొనుగోలు చేసేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణాధికారి వి.అనిత, వీఏఏలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో అనంతలక్ష్మి

ప్రజాసమస్యల పరిష్కారమే కూటమి లక్ష్యం

● ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు, మార్చి26 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కరమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా అన్నారు. రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం గ్రీవెన్సీ డే ను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజలనుంచి వచ్చిన అర్జీలను ఎమ్మెల్యే స్వీకరించారు. వాటిల్లో ముఖ్యంగా నూతన పింఛన్లు మంజూరు చేయించాలని, పేదలకు నివేశనస్థలాల అందించాలని అధిక సంఖ్యలో అర్జీలు వచ్చాయి. రైతుల పంట ఉత్పత్తులకోసం డొంక రహదారులను అభివృద్ధి చేయాలని, డ్రెయినేజీలు సక్రమంగా లేక ఇబ్బందులేదుర్కొంటున్న వారు అర్జీలు అందించిన వారిలో ఉన్నారు. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం నూతన పింఛన్లు, , రేషన్‌కార్డులతోపాటు పేదలకు నివేశన స్థలాలను అందిస్తుందని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ , జనసేన నేతలు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన తప్పనిసరి

● గుడివాడ సహాయ వ్యవసాయ సంచాలకులు నిమ్మగడ్డ రమాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న నిమ్మగడ్డ రమాదేవి

నందివాడ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ వ్యవసాయానికి సంబంధించి రాబోయే ఖరీఫ్ సీజన్‌కు కార్యచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని గుడివాడ సహాయ వ్యవసాయ సంచాలకులు నిమ్మగడ్డ రమాదేవి రైతులకు సూచించారు. మండలంలోని పెదలింగాల రైతు సేవా కేంద్రంలో ఏవో భాను ప్రకాష్ అధ్యక్షతన వ్యవసాయ రైతులు సీఆర్‌పీలు, ఐసీఆర్‌పీలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ రానున్న వేసవికాలంలో పీఎంపీఎస్ కిట్లు (32 రకాల విత్తనాల కిట్లు) వేయటం ద్వారా భూమిగుల్ల బారీ నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందన్నారు. తద్వారా భూమిలో మొక్కలకు ఉపయోగపడే సూక్ష్మజీవుల అభివృద్ధి జరుగుతుందన్నారు. అనంతరం మండల వ్యవసాయాధికారి భాను ప్రకాష్ మాట్లాడుతూ సేంద్రీయ పద్ధతిలో పండించిన ఉద్యాన , ఆహార పదార్థాల వల్ల హానికరమైన వ్యాధులు దరిచేరకుండా ఆరోగ్యమైన జీవితం గడపటానికి అవకాశం ఉందన్నారు. రానున్న రోజులలో ఎక్కువ మంది రైతులు కొంత మేర విస్తీర్ణంలో సేంద్రీయ సాగు చేపట్టాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఏపీఎం కె.వీరవసంతరావు, గోళ్ల గంగరాజు, వీవోఏలు, డ్వాక్రా సంఘాల సభ్యులు, వ్యవసాయ రైతులు , తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు మాతృవియోగం

నందివాడ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మాజీ సర్పంచ్ ఎరుకపాటి రత్న ప్రసాద్ తల్లి రత్నబాయమ్మ (90) బుధవారం సాయంత్రం మృతి చెందారు. ఇప్పటి వరకు అనారోగ్యానికి గురికాకుండా తిరుగుతున్నారు. రత్నబాయమ్మ మరణవార్త తెలుసుకున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు ఫోన్‌లో పలకరించినట్లు రత్న ప్రసాద్ తెలిపారు. ఎరుకపాటి రత్న ప్రసాద్ టీడీపీ స్థాపించినప్పటి నుంచి పార్టీలో చురుకుగా ఉన్నారు. తుమ్మలపల్లి టీడీపీ గ్రామ పార్టీ ప్రెసిడెంట్ గాను, యూనిట్ ఇంచార్జ్ గాను పార్టీకి సేవలందించినట్లు మండల నాయకులు తెలిపారు. మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



రత్న బాయమ్మ(ఫైల్)

చంద్రాలలో లేగదూడల అందాల పోటీలు

గుడ్లవల్లేరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరు డివిజన్ పశుసంవర్థక శాఖ , జిల్లా పశుగణాభివృద్ధి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో చంద్రాలలో బుధవారం లేగ దూడల అందాల పోటీలను నిర్వహించారు. దూడల అందం, వాటి ఆరోగ్యం ప్రాధాన్యతల ప్రకారం ప్రదర్శనలో పాల్గొన్న లేగ దూడల యజమానులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి డాక్టర్ కె.శ్రీనివస్, డివిజనల్ ఉపసంచారకులు డాక్టర్ సి.శ్రీనివాస్, సహాయ సంచారకులు ఎం.జగన్నాథరావు,డాక్టర్ ఎ.లక్ష్మణరావు, గ్రామ సర్పంచ్ అర్జునరావు, మండల టిడిపి నాయకులు అడుసుమిల్లి రామ్మోహనరావు(చంద్రాల చిటగ్గిబాబు),డాక్టర్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

● అడిషనల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ పి.గాయత్రి

గుడివాడ, మార్చి 26(ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థీ చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని అడిషనల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ పి.గాయత్రి పేర్కొన్నారు. స్థానిక రాజేంద్ర నగర్‌లోని గుత్తా రామకృష్ణయ్య(టౌన్ హైస్కూల్)లో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థిదశ నుంచే చట్టాలపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. ఎవరి మాయ మాటలు నమ్మి ఫోన్ నెంబర్లు ఇవ్వవద్దన్నారు. బహుమతులకు లొంగి తల్లిదండ్రులకు తెలియకుండా ఎక్కడికి వెళ్లరాదని విద్యార్థినులకు సూచించారు.విద్యార్థినులపై ఆకతాయిల వేధింపులు, లైంగిక దాడులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఒన్‌టౌన్ పోలీసులు, శక్తి టీమ్ సభ్యులు శిరీష, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయాధికారి గాయత్రి

విఘ్నేశ్వరస్వామి మండపం నిర్మాణానికి విరాళాలు

గుడివాడ : స్థానిక మెయిన్‌రోడ్డులో వేంచేసియున్న విఘ్నేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన కాలక్షేప మండపం అభివృద్ధి నిమిత్తం బొమ్మిశెట్టి రామసుబ్బారావు గుప్తా రూ.6,000లు, విశ్వనాథుని నాగేశ్వరరావు రూ.9,000లు, కీర్తిశేషులు కపిలవాయి రవిశాస్త్రి జ్ఞాపకార్థం ఆయన కుమారులు రూ.7,200లు విరాళంగా అందజేశారని ఆలయ కార్యనిర్వహణాధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు(వాసు) తెలిపారు. బుధవారం స్థానిక ఆలయ ఆవరణలో విరాళాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు



చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

పామర్రు, మార్చి26 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్య బాధలతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న పేద కుంటుబాలకు ముఖ్యమంత్రి సహయనిధి ద్వారా అందిస్తున్న ఆర్థిక చేయూతను సద్వినియోగం చేసుకుని ఆరోగ్య భాదలనుంచి విముక్తులు కావాలని ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారంనియోజకవర్గపరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 64మంది పేదకుటుంబాలకు వైద్య చికిత్సల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధినుంచి మంజూరైన రూ.25.73లక్షల విలువైన 297 చెక్కులను బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐదుమండలాలకు చెందిన టీడీపీ నేతలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

పామర్రు: మానవతా విలువలతో మనిషిని మహోన్నతుడిగా మారాలన్నదే పవిత్ర రంజాన్ ఉపవాసాల అసలు ఉద్దేశ్యమని ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజాఅన్నారు. స్థానిక చిన్నమసీదులో బుధవారం జరిగిన ఇఫ్తార్ విందులో కూటమిశ్రేణులతో కలసి ఆయన పాల్గొన్నారు. తొలుత మసీదులో ముస్లీంలతో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఈకార్యక్రమంలో కృష్ణాడెల్టా వైస్‌చైర్మన్ వల్లూరిపల్లిగణేష్, చాట్లరమేష్, వార్డుసభ్యులు మంతెన రామాంజనేయులు, పామర్తి వెంకయ్య, ముస్లిం నేతలు పాల్గొన్నారు.

వడ్లమన్నాడుకు బస్సు సర్వీసులు

గుడ్లవల్లేరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : వడ్లమన్నాడు - విజయవాడకు 333 జి బస్సు సర్వీసును పొడిగించారు. బుధవారం నుంచి ఈ సర్వీస్ బస్సును నడపనున్నారు. వడ్లమన్నాడు గ్రామస్థుల కోరిక మేరకు మండల టీడీపీ అధ్యక్షులు కొసరాజు బాపయ్య చౌదరి, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాములు ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ రావును కోరగా గుడ్లవల్లేరు - విజయవాడ సర్వీసును వడ్లమన్నాడు వరకూ పొడిగించారని వడ్లమన్నాడు ఉప సర్పంచ్ గరికపాటి రాంబాబు తెలిపారు. తెల్లవారుజామున 5.15కు, ఉదయం 8.45 లకు విజయవాడకు రెండు బస్సులు నడవనున్నామన్నారు. అలానే విజయవాడలో ఉదయం 6 గంటలకు, రాత్రి 8 గంటలకు రెండు సర్వీసులను బుధవారం నుంచి ఆర్టీసీ వారు నడుపుతున్నారని రాంబాబు తెలిపారు. అడిగిన వెంటనే ప్రజల అవసరాన్ని గుర్తించి బస్ సర్వీసులు ఏర్పాటు చేసిన కొనకళ్ల నారాయణకు, దానికి సహకరించిన ఎమ్మెల్యే రాము, కొసరాజు బాపయ్య చౌదరిలకు వడ్లమన్నాడు, వేమవరం, కొండాలమ్మ అమ్మవారి ఆలయం, రెడ్డిపాలెం, గాదేపూడి, ఉలవలపూడి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



విజయవాడకు ప్రారంభమైన బస్ సర్వీసు

ఆర్థోపెడిక్ థెరపిపై అవగాహన

గుడివాడ : ఆధునిక ఆర్థోపెడిక్ మాన్యువల్ థెరపీ ద్వారా దీర్ఘకాలిక నొప్పిని తగ్గించుకోవచ్చునని ప్రముఖ ఆర్థోపెడిక్ మాన్యువల్ థెరపిస్ట్ డాక్టర్ వి.ప్రేమ్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక రాజేంద్రనగర్‌లోని జి.వి పూర్ణచంద్రరావు కమ్యూనిటీ హాల్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో దీర్ఘకాలిక నొప్పులు, కారణాలు, నివారణ, బయోమెకానిక్స్ ప్రాముఖ్యత, సమర్థవంతమైన చికిత్సా విధానాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష,కార్యదర్శులు టి.ఎన్ రాజశేఖర్, జి.కిరణ్‌బాబు, కౌన్సిలర్ జి.బాబుశ్రీకర్, సభ్యులు పాల్గొన్నారు.